జైత్ర
మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్

PRGI NO TGTEL/26/A2948

జ్యోతి
# శ్వేత
JYYOTHI SHWETHA
దినపత్రిక

హైదరాబాద్ ॥సంపుటి:1 ॥ సంచిక: 19 ॥గురువారం ॥ 18-6-2026 ॥ పేజీలు: 8 ॥ వెల 3/-







# నియోజకవర్గానికి "ఒక టీపీఎస్..!

కుల నిర్మూలనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోందని, సమాజంలో అసమానతలు తొలిగిపోయి అందరికీ నాణ్యమైన విద్య అందాలనే సదుద్దేశంతోనే సమీకృత పాఠశాలలను నిర్మిస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. రంగారెడ్డి జిల్లా ఆరుట్లలో తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను సీఎం రేవంత్ ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ఆరుట్లలో ప్రారంభించుకున్న టీపీఎస్‌ను రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అంకితం చేస్తున్నామని ప్రకటించారు.

### ఆరుట్లలో 15 కోట్లతో తెలంగాణ పబ్లిక్ స్కూల్

### లాంఛనంగా ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి

### క్లాసుల పరిశీలన, ఫుట్‌బాల్ ఆడిన రేవంత్ రెడ్డి

ఆరుట్ల, జూన్ 17: గత ప్రభుత్వం వర్గానికొక పాఠశాలను ఏర్పాటు చేసి కుల వ్యవస్థను ప్రోత్సహించిందని, ఆ వివక్షను రూపుమాపేందుకే ఎక్కడా వివక్షకు తావులేకుండా ఈ బడులను నిర్మిస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. జీవితాలను సమూలంగా మార్చగల శక్తి ఒక్క విద్యకు మాత్రమే ఉందన్నారు. తెలంగాణ భవిష్యత్ అద్దాల మేడలు రంగుల గోడల్లో లేదు.. తరగతి గదుల్లోనే ఉందని మేం సంపూర్ణంగా విశ్వసించాం. విద్యాకమిషన్ తరువాయి 2 వ పేజీలో..



### ప్రయాణికులు, విద్యార్థులతో

# మంత్రి పొన్నం ముఖాముఖి

### ఆర్టీసీ అభివృద్ధిపై ప్రభుత్వ కృషి వివరణ

### ప్రజా సంక్షేమ పథకాలపై అవగాహన

కరీంనగర్, జూన్ 17

కరీంనగర్‌లో వాగేశ్వరి ఇంజనీరింగ్ కళాశాల నుంచి ఎన్టీఆర్ విగ్రహం వరకు రాష్ట్ర రవాణా సంస్థ బస్సులో మంత్రి పొన్నం ప్రభాకర్ సహచ ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో కలిసి ప్రయాణించారు. ఈ సందర్భంగా బస్సులోని ప్రయాణికులు, విద్యార్థులతో ముచ్చటిస్తూ వారి సమస్యలు, అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నా రు. విద్యార్థులతో మాట్లాడిన మంత్రి, పాఠశాల లు, కళాశాలల సమయాలకు అనుగుణంగా అదనపు బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి (మిగతా 2వ పేజీలో)



# విద్యుత్ ఉద్యోగులకు డీఏ పెంపు

### 1.621 శాతం డీఏ పెంచుతూ ప్రభుత్వ నిర్ణయం

### 70,804 మంది ఉద్యోగులకు ప్రయోజనం.. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

విద్యు త్ ఉద్యోగులకు డీఏ పెంచుతూ ఉప ముఖ్య మంత్రి భట్టి విక్రమార్క కీలక నిర్ణయం తీసుకు న్నారు. విద్యుత్ సౌధలోని జెన్ కో ప్రధాన కార్యాలయంలో బుధవారం ఇంధన శాఖ అధికారల సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఈ నిర్ణయం తీసుకున్నారు.. విద్యుత్ సంస్థల ఉ ద్యోగులు, ఆర్టిజన్లు, పెన్షన ర్లకు ఈ ఏడాది జనవరి 1 నుంచి అమలులోకి వచ్చేలా డీఏను పెంచే ప్రతిపాదనకు డిప్యూటీ సీఎం పచ్చ జెండా ఊపారు.

హైదరాబాద్, జూన్ 17: విద్యుత్ ఉద్యోగు లకు 1.621 శాతం మేర డీఏను పెంచుతూ ప్రజాప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీనితో విద్యుత్ ఉద్యోగుల డీఏ 17.651% నుంచి 19.272% కి చేరినట్లు అయింది. ఈ డీఏ పెంపు వల్ల ప్రభుత్వంపై నెలకు సుమారు రూ. 9.35 కోట్ల అదనపు ఆర్థిక భారం పడనుంది. విద్యుత్ రంగ సంస్థల్లో పని చేస్తున్న మొత్తం 70,804 మంది సిబ్బంది, పెన్షనర్లు ఈ డీఏ పెంపు వల్ల ప్రయోజనం పొందనున్నా రు. ఈ సమావేశంలోనే విద్యుత్ రంగ పనితీరును ఉప ముఖ్యమంత్రి సమీక్ష చేశారు. ప్రధానంగా రాబోయో వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా విద్యుత్ అధికారులు సన్నద్ధం కావాలని చెప్పారు. అలాగే రానున్న పదేళ్లను దృష్టిలో (మిగతా 2వ పేజీలో)



# చిన్నారి కోరిక తీర్చిన పవన్..!

### అభిమాని కోసం హనుమకొండకు వెళ్లిన ఏపీ డిప్యూటీ సీఎం పవన్

### అరుదైన వ్యాధితో మంచానికే పరిమితమైన నిరంజన్

### దగ్గరకు తీసుకుని ఆత్మీయ ఆలింగనం చేసుకుని ధైర్యం చెప్పిన పవన్

### నిరంజన్ కోసం వరంగల్ భద్రకాళీ అమ్మవారి గుడిలో ప్రత్యేక పూజలు

### బాలుడి కుటుంబానికి నిర్మాత బండ్ల గణేష్ రూ.5 లక్షల సాయం

హనుమకొండ, జూన్ 17: ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ మరోసారి తన గొప్ప మానవత్వాన్ని చాటుకున్నా రు. అరుదైన జన్యుపరమైన వ్యాధితో పోరాడుతూ మంచానికే పరిమిత మైన తన వీరాభిమాని చివరి కోరికను తీర్చేందుకు ఆయన స్వయంగా కదిలివచ్చారు. తెలంగాణలోని తరువాయి 2 వ పేజీలో...

# ఆదాయ వనరులు తగ్గిపోతున్నాయి

### పాలేరు కార్యకర్తల సమావేశంలో వ్యాఖ్యలు

### ఆర్థిక పరిస్థితిపై ప్రభుత్వాన్ని నిలదీత

### అవినీతి ఆరోపణలు చేసిన బీఆర్ఎస్ నేత కేటీఆర్



ఖమ్మం, జూన్ 17 : రాష్ట్రంలో ఆదాయ వనరులు తగ్గిపోతున్నాయని, ప్రభుత్వ ఆర్థిక పరిస్థితి క్షీణిస్తోందని బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు ఆరోపించారు. ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గంలో (మిగతా 2వ పేజీలో)



### భారత్-యూరోపియన్ బంధాలు

# బలోపేతం

## ప్రధాని మోదీ

### ఈవియన్‌లో కీలక భేటీలు

### స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై హర్షం

ఈవియన్, జూన్ 17

యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టా, యూరోపియన్ కమి షన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్ లేయెన్‌లతో ఈవియన్‌లో జరిగిన భేటీ ఎంతో సంతోషాన్ని కలిగించిందని ప్రధా ని నరేంద్ర మోదీ తెలిపారు. భారత్-యూరోపియన్ యూనియన్ సంబంధాలు ప్రస్తుతం అత్యంత కీలక దశలో ఉన్నాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ, ఈ ఏడాది ప్రారంభంలో జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకలకు యూరోపియన్ యూనియన్ నాయకత్వాన్ని భారత్ ఆహ్వానించడం (మిగతా 2వ పేజీలో)

# నేటి రాశి ఫలాలు

**మేషం :** పనుల్లో కొంత జాగ్రత్త అవసరం. నిర్ణయాల్లో ఆలోచన అవసరం. ఆర్థిక సంబంధ వ్యవహారాల్లో నియంత్రణ పాటించాలి. కుటుంబంలో చిన్నపాటి విభేదాలు రావచ్చు. నవగ్రహ శ్లోకాలు పఠించాలి.

**వృషభం :** వృత్తి, వ్యాపారాల్లో అనుకూల ఫలితాలు కనిపిస్తాయి. ఆర్థికంగా లాభాలు ఉన్నప్పటికీ ఖర్చులను నియంత్రించడం మంచిది. కుటుంబ సభ్యుల సహకారం పనులు పూర్తి చేయడంలో తోడ్పడుతుంది. శివారాధన చేయాలి.

**మిథునం :** ఉద్యోగంలో గుర్తింపు, పురోగతి కనిపిస్తుంది. ఆర్థిక పరంగా అభివృద్ధి, లాభాలు వచ్చే అవకాశాలు ఉన్నాయి. కుటుంబంలో ఆనందకర వాతావరణం ఉంటుంది. శ్రీమహాలక్ష్మీ ప్రార్థన శ్రేయస్కరం.

**కర్కాటకం :** ఉద్యోగంలో పురోగతి సాధ్యం అవుతుంది. బాధ్యతలు పెరుగుతాయి. ఆర్థికంగా స్థిరత్వం ఉంటుంది. కుటుంబ విషయాల్లో సహనం అవసరం. దుర్గా నామస్మరణ మేలు చేస్తుంది.

**సింహం :** వృత్తిలో కొత్త అవకాశాలు వస్తాయి. కొత్త ప్రయత్నాలు ఫలిస్తాయి. ఆర్థికంగా సాధారణ లాభాలు ఉంటాయి. ప్రయాణాలు అనుకూలంగా మారతాయి. సూర్యారాధన శుభప్రదం

**కన్య :** వ్యాపారంలో లాభాలు, పనుల్లో పురోగతి కనిపిస్తుంది. ఆర్థిక పరంగా మెరుగుదల ఉంటుంది. పెట్టుబడులు జాగ్రత్తగా చేయాలి. కుటుంబంలో శాంతి ఉంటుంది. శ్రీ మహాగణపతి ధ్యానం చేయాలి.

**తుల :** పనుల్లో జాగ్రత్తగా ముందుకు సాగాలి. ఆలస్యాన్ని తగ్గించాలి. ఆర్థికంగా సాధారణ పరిస్థితులు ఉంటాయి. కుటుంబంలో చర్చల ద్వారా సమస్యలు పరిష్కారం అవుతాయి. శివనామస్మరణ శ్రేయస్కరం.

**వృశ్చికం :** వృత్తిలో లాభాలు, ఆదాయం పెరుగుతుంది. ఆర్థికంగా బలపడే సూచనలు ఉన్నాయి. కుటుంబంలో ఆనందకర పరిణామాలు ఉంటాయి. శ్రీసూర్య ధ్యానం శ్రేయస్కరం

**ధనుస్సు :** వృత్తిలో పురోగతి, గౌరవం లభిస్తుంది. ఆర్థికంగా లాభాలు ఉన్నప్పటికీ ఖర్చులు పెరిగే అవకాశం ఉంది. ప్రయాణాలు అనుకూలంగా ఉంటాయి. శ్రీవిష్ణు సహస్రనామం పఠించాలి.

**మకరం :** ఉద్యోగ, వ్యాపారాల్లో శుభఫలితాలు కనిపిస్తాయి. ఆర్థికంగా అభివృద్ధి, స్థిరత్వం ఉంటుంది. కుటుంబంలో శుభకార్యక్రమాల సూచనలు ఉంటాయి. శ్రీలక్ష్మీ అష్టోత్తరం పారాయణం చేయాలి.

**కుంభం :** పనుల్లో సహచరుల సహకారం లభిస్తుంది. ఆర్థికంగా లాభాలు ఉన్నప్పటికీ జాగ్రత్త అవసరం. కుటుంబంలో సమన్వయం మంచిది. నవగ్రహ శ్లోకాలు చదవాలి.

**మీనం :** ఉద్యోగంలో మంచి ఫలితాలు, గుర్తింపు లభిస్తుంది. ఆర్థికంగా శుభఫలితాలు ఉన్నాయి. ఖర్చుల విషయంలో నియంత్రణ అవసరం. కుటుంబ సభ్యుల సహకారం లభిస్తుంది. శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామిని ప్రార్థించాలి







# నియోజకవర్గానికి ఒక టీపీఎస్..!

**మొదటి పేజీ తరువాయి**

నివేదిక ప్రకారం ప్రభుత్వం పాఠశాలలల్ని బలోపేతం చేస్తున్నామన్నారు. సమాజంలో అసమానతలు పోవాలంటే అందరికీ నాణ్యమైన విద్య అవసరమని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యపై తల్లిదండ్రులకు అపోహలు ఉన్నాయని, వాటిని తొలగించేందుకే తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ నిర్మాణానికి చుట్టామని సీఎం తెలిపారు.

### ఆదర్శంగా తెలంగాణ పబ్లిక్ స్కూల్

రంగారెడ్డి జిల్లా మంచాల మండలం ఆరుట్లలో 15 కోట్ల రూపాయలతో అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించిన తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను ప్రారంభించిన అనంతరం పాఠశాల ఆవరణ కలియదిరిగిన ముఖ్యమంత్రి ఉదయం బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని ప్రారంభించి విద్యార్థులతో కలిసి అల్పాహారం స్వీకరించారు . అనంతరం తరగతి గదులు, డిజిటల్ క్లాసులు, ల్యాబ్‌లు పరిశీలించి మైదానంలో విద్యార్థులతో కలిసి కొద్దిసేపు సరదాగా ఫుట్‌బాల్ ఆడారు. ఆరుట్ల పాఠశాలలో ఇప్పటికే 1814 మంది విద్యార్థులు చేరారని, ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో ప్రతి నియోజకవర్గంలో ఒక పబ్లిక్ స్కూల్ నిర్మిస్తామని వెల్లడించారు.

### విద్యా వ్యవస్థ పూర్తి ప్రక్షాళన

విద్యాశాఖపై రాష్ట్ర ప్రభుత్వం 27 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తోందని ముఖ్యమంత్రి తెలిపారు. విద్యా వ్యవస్థను ప్రక్షాళన చేసేందుకే ప్రత్యేకంగా విద్యా కమిషన్ ఏర్పాటు చేసినట్లు వివరించారు. గత ప్రభుత్వం పంపిణీ చేసిన దుస్తులు నెల రోజులకే చిరిగిపోయాయని, దాన్ని సరిదిద్దుతూ తొమ్మిది రకాల వస్తువులతో కూడిన నాణ్యమైన విద్యా కిట్లను విద్యార్థులకు అందజేస్తున్నట్లు తెలిపారు. కిట్ల పంపిణీ కోసం 680 కోట్ల రూపాయలకు టెండర్లు పిలిస్తే అందులో ఏకంగా మూడు వేల కోట్ల కుంభకోణం జరిగిందని ప్రతిపక్షాలు ఆరోపించడం వారి అజ్ఞానానికి నిదర్శనం అని ఆయన ఎద్దేవా చేశారు.

### డిసెంబర్ తొమ్మిదిన స్కిల్ వర్సిటీ

కృత్రిమ మేధ రాకతో ఉపాధి అవకాశాలు మారుతున్న నేపథ్యంలో యువతకు బ్లూ కాలర్ ఉద్యోగాలు సృష్టించే లక్ష్యంతో డిసెంబర్ తొమ్మిదో తేదీన యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని ప్రారంభిస్తున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. అలాగే 2034 ఒలింపిక్స్‌లో తెలంగాణ నుంచి బంగారు పతకం సాధించేలా క్రీడాకారులను తీర్చిదిద్దేందుకు పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్య పద్ధతిలో స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తి నింపేందుకు ఫుట్‌బాల్ దిగ్గజం మెస్సీని హైదరాబాద్‌కు తీసుకొస్తుంటే ప్రతిపక్షాలు కుసంస్కారంతో విమర్శలు చేస్తున్నాయని మండిపడ్డారు. ఈ పాఠశాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రితో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు కే. కేశవ రావు, శాసన మండలి చీఫ్‌విప్ పట్నం మహేందర్ రెడ్డి ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

## ..కేటీఆర్ తీవ్ర విమర్శలు

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించిన బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న ఆయన రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఈ సందర్భంగా మాట్లాడిన కేటీఆర్, రాష్ట్రంలో రెవెన్యూ వసూళ్లు తగ్గుముఖం పడుతున్నాయని అన్నారు. ప్రభుత్వ ఆర్థిక నిర్వహణలో లోపాల కారణంగా అభివృద్ధి కార్యక్రమాలు ప్రభావితమవుతున్నాయని ఆరోపి ంచారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ప్రభుత్వం ప్రజలకు సరైన సమాచారం ఇవ్వడం లేదని విమర్శించారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను లక్ష్యంగా చేసుకుని కేటీఆర్ పలు ఆరో పణలు చేశారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ ఇబ్బందులు ఎదుర్కొం టున్నప్పటికీ కొందరు వ్యక్తుల ఆర్థిక ప్రయోజనాలు మాత్రం పెరుగుతున్నాయని వ్యాఖ్యానించారు. ప్రభుత్వంలో అవి నీతి, కమీషన్ల వ్యవహారాలు పెరిగిపోయాయని ఆరోపించా రు. ప్రస్తుత ప్రభుత్వ పాలనలో ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని కేటీఆర్ పేర్కొన్నారు. ఎన్నికల సమయ ంలో ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. రైతులు, యువత, ఉ ద్యోగులు, పేదల సమ స్యలపై ప్రభుత్వం దృష్టి సారించడం లేదని విమర్శించారు. బీఆర్‌ఎస్ హయాంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ఈ సందర్భంగా ఆయన ప్రస్తావించారు.

## భారత్-యూరోపియన్ ..

(మొదటి పేజీ తరువాయి)

గర్వకారణమని అన్నారు. భారత్-ఈయూ సంబంధాలు మరింత బలపడుతున్నాయని పేర్కొన్నారు. భారత్, యూరోపియన్ యూనియన్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం పూర్తికావడం ద్వైపాక్షిక సంబంధాల్లో ఒక కీలక మైలురాయిగా నిలిచిందని మోదీ అభిప్రాయప డ్డారు. ఈ ఒప్పందం ద్వారా వాణిజ్యం, పెట్టుబడులు, పరిశ్రమల రంగాల్లో కొత్త అవకాశాలు ఏర్పడతాయని తెలిపారు. భేటీ సందర్భంగా ఇరు పక్షాల మధ్య ఆర్థిక సంబంధాలను మరింత విస్తరించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించినట్లు ప్రధాని వెల్లడించారు. భవిష్యత్తులో వాణిజ్య, సాంకేతిక, పెట్టుబడి రంగాల్లో సహకారాన్ని మరింత బలోపేతం చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ప్రస్తుత ప్రపంచ పరిస్థితుల్లో భారత్-యూరోపియన్ యూనియన్ భాగస్వామ్యం శాంతి, స్థిరత్వం, ఆర్థికాభివృద్ధి కి కీలక పాత్ర పోషిస్తుందని మోదీ పేర్కొన్నారు. ప్రపంచ సవాళ్లను ఎదుర్కొనేందుకు పరస్పర సహకారం అవసరమ ని అన్నారు. ఇరు పక్షాల మధ్య పెరుగుతున్న సహకారం ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు సానుకూల సంకేతాలను ఇస్తోం దని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

## డీఏ పెంపు

(మొదటి పేజీ తరువాయి)

పెట్టుకుని విద్యుత్ రంగ సంస్థల్లో మౌలిక సదుపాయాల కోసం పటిష్టమైన ప్రణాళికను రూపొందించడంపై ఆయన అధికారులుకు పలు సూచనలు చేశారు. ఈ ఎండాకాలంలో రికార్డు స్థాయిలో గరిష్ట డిమాండ్ ఎదురైనా ఎక్కడా విద్యుత్ సరఫరాలో అంతరాయాలు లేకుండా చూసిన అధికారులను, సిబ్బందిని ఉప ముఖ్యమంత్రి ప్రత్యేకంగా అభినందించారు. ఈ ఏడాది మార్చి 27న పీక్ డిమాండ్ 18,548 మెగావాట్లకు చేరిందన్నారు. అయినా సరఫరాలో అంతరయాలు లేకుండా ముందస్తు ప్రణాళికతో అధికారులు, సిబ్బంది పని చేశారని ఆయన అన్నారు. అలాగే మార్చి 13, 2026 న అత్యధికంగా 341 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం నమోదైనా నిరంతరాయ విద్యుత్ సరఫరా అందించడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, రాబోయే దశాబ్ద కాలానికి సమగ్రమైన, దీర్ఘకాలిక విద్యుత్ ప్రణాళికను సిద్ధం చేయాలని విద్యుత్ రంగ అధికారులకు డిప్యూటీ సీఎం సూచించారు. రాబోయే పదేళ్లలో రాష్ట్రంలో వేగంగా పెరుగుతున్న విద్యుత్ అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాలను విస్తరించాలని అన్నారు. రాష్ట్రంలో 2035-36 నాటికి పీక్ డిమాండ్ 34,137 మెగావాట్లకు చేరుకుంటుందని అంచనాగా చెప్పారు. ఈ ఏడాది నమోదైన పీక్ డిమాండ్ 18,548 మెగావాట్లకు దాదాపు రెట్టింపుగా ఉంటుందని అన్నారు. అంతేకాకుండా 2035-36 నాటికి వార్షిక విద్యుత్ అవసరాలు 1,52,626 మిలియన్ యూనిట్లకు (వీఖ) చేరుకుంటుందన్నారు. వర్షాకాలం సమీపిస్తున్న తరుణంలో ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్, ట్రాన్స్ కోలు అత్యంత సంసిద్ధంగా ఉండాలని ఆయన అధికారులకు సూంచించారు. ఇంజనీర్లు, సిబ్బంది అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఆయన ఆదేశించారు. సమీక్షా సమావేశంలో ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్, ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, సింగరేణి సీఎండీ జ్యోతి బుద్ధ ప్రకాష్, ట్రాన్స్ కో సీఎండీ కృష్ణ భాస్కర్, జెన్ కో సీఎండీ హరీష్, ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి, ఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ పాటిల్, ట్రాన్స్‌మిషన్ డైరెక్టర్ సంపత్ కుమార్, ట్రాన్స్ కో ప్రాజెక్ట్స్ డైరెక్టర్ శ్రీమతి లతా వినోద్ ఇతర విద్యుత్ సంస్థల అధికారులు పాల్గొన్నారు.



## చిన్నారి కోరిక తీర్చిన పవన్..!

**మొదటి పేజీ తరువాయి**

హనుమకొండ హనుమాన్ నగర్‌కు చెందిన 17 ఏళ్ల నిరంజన్‌ను బుధవారం నేరుగా అతని ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఎదుగుదల లేని స్థితిలో ఉన్న బాలుడిని ఆత్మీయంగా హత్తుకుని చలించిపోయిన పవన్.. కుటుంబ సభ్యులకు కొండంత అండగా నిలిచారు.

### చోటా గబ్బర్ సింగ్

### చిరు కోరిక తీర్చిన పవన్

మంచంపై ఉన్న నిరంజన్ పరిస్థితి చూసి కదిలిపోయిన పవన్, బాలుడి నుదిటిపై ముద్దుపెట్టి ఆప్యాయంగా పలకరించారు. చిన్నప్పటి నుంచి మీరం టే ప్రాణం అని బాలుడు చెప్పడం, తానెంతో ఆరోగ్యంగా ఉ న్నప్పుడు పవన్ ను అనుకరిస్తూ వేసిన డ్యాన్సుల వీడియోలను చూపించడం అక్కడున్న వారి ని కలచివేసింది. అంతా తనను చోటా గబ్బర్ సింగ్ అని పిలుస్తారని బాలు డు చెప్పడంతో పవన్ భావోద్వేగానికి గురయ్యారు. తనకు ఓ కుక్కపిల్ల కావా లని నిరంజన్ కోరగా, వెంటనే కొని పంపుతానని ఆయన హామీ ఇచ్చారు.

### ఉపాధి కోసం క్యాంటీన్..

### అమ్మవారికి పూజలు

నిరంజన్ వైద్య ఖర్చుల నిమిత్తం పవన్ కళ్యాణ్ తక్షణమే లక్ష రూపాయల ఆర్థిక సాయం అందజేశారు. బాలుడి తల్లిదండ్రులు గతంలో ఆసుపత్రి క్యాంటీన్‌లో పనిచేసేవారని తెలుసుకుని, వారి శాశ్వత జీవనోపాధి కోసం వెంటనే ఓ క్యాంటీన్ ఏర్పాటు చేయాలని స్థానిక జనసేన నేతలకు దిశానిర్దేశం చేశారు. పరామర్శ అనంతరం నేరుగా వరంగల్ భద్రకాళీ అమ్మవారి ఆలయంలో నిరంజన్ కోలుకోవాలని పవన్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి వెండి ప్రతిమకు పూజ చేయించి ఆ బాలుడి కుటుంబానికి పంపుతానని చెప్పారు. కాగా, పవన్ వెంట జనసేన తెలంగాణ ఇన్‌ఛార్జ్ శంకర్ గౌడ్, రామ్ తాళ్లూరి తదితరులు ఉన్నారు.

### బండ్ల గణేష్ రూ.5 లక్షల సాయం

అరుదైన వ్యాధితో బాధపడుతున్న నిరంజన్ దీనస్థితికి చలించిన ప్రముఖ సినీ నిర్మాత బండ్ల గణేష్.. తన బ్యానర్ పరమేశ్వర ఆర్ట్ ప్రొడక్షన్స్ తరఫున రూ.5 లక్షల ఆర్థిక సాయం ప్రకటించారు. ఆ కుటుంబానికి అండగా నిలుస్తానని ఆయన భరోసా ఇచ్చారు.

## ప్రయాణికులు, విద్యార్థులతో మంత్రి పొన్నం ముఖాముఖి

(మొదటి పేజీ తరువాయి)

ఇబ్బందులు తలెత్తకుండా రవాణా సౌకర్యాలను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. గురుకుల పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు వివరించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం అమలులోకి వచ్చిన తర్వాత ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగిందని మంత్రి తెలిపారు. పెరిగిన రద్దీని దృష్టిలో ఉంచుకుని కొత్త బస్సులను కొనుగోలు చేస్తున్నామని చెప్పారు. ప్రజా ప్రభుత్వం ఆధ్వర్యంలో ఆర్టీసీని మరింత బలోపేతం చేసేందుకు చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఆర్టీసీ సిబ్బందితో మాట్లాడిన మంత్రి, వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. పీఆర్సీ అమలు, గుర్తింపు సంఘాల ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైందని తెలిపారు. ఎన్నికలు పూర్తైన తర్వాత గెలిచిన సంఘాలతో చర్చలు జరిపి తదుపరి చర్యలు చేపడతామని చెప్పారు. ఈ నిర్ణయాలపై ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు సంతృప్తి వ్యక్తం చేసినట్లు పేర్కొన్నారు. ప్రయాణికులతో సంభాషిస్తూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వల్ల ప్రతి నెలా వేల రూపాయల వరకు ఆదా అవుతోందని తెలిపారు. ఉచిత విద్యుత్, గ్యాస్ సబ్సిడీ, కొత్త రేషన్ కార్డులు, సన్నబియ్యం పంపిణీ, రైతు రుణమాఫీ, రైతు భరోసా వంటి పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందని చెప్పారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమాన్ని సమన్వయం చేస్తూ ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఆర్టీసీ సేవలను బలోపేతం చేయడంతో పాటు ప్రజా సంక్షేమ కార్యక్రమాలను మరింత విస్తృతంగా అమలు చేస్తామని తెలిపారు.

శ్వేత

# సంపాదకీయం

గురువారం 18-6-2026

## విద్యార్థులకు నీట్ కటకటలు!

నీట్ ఏ ముహూర్తాన ప్రవేశ పెట్టారో కానీ ఎప్పుడూ సవ్యంగా సాగడం లేదు. ఈ నెల 21 తిరిగి నీట్ నిర్వహించబోతున్నారు. ఈ క్రమంలో పరీక్షాపత్రం సిద్ధం చేసిన వారిని రహస్య ప్రాంతంలో విడిది చేయించారు. వారికి ఫోన్, టివి లాంటివి అందుబాటులో లేకుండా రహస్యంగానే ఉంచారు. గతంలో ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రం ఎంసెట్ నిర్వహించుకున్నప్పుడు ఎక్కడా లోపాలు లేవు. సాఫీగా ఎంసెట్ జరిగింది. మెడికల్ కాలేజీల్లో అడ్మిషన్లు సాఫీగా సాగాయి. కానీ ఎప్పుడైతే జాతీయ స్థాయిలో నీట్ ప్రవేశ పెట్టాక గందరగోళం, పేపర్ లీక్‌లు సర్వసాధరణంగా మారింది. తాజాగా మరోమారు పేపర్ లీక్ కావడంతో ఈ నెల 21వ తేదీన తిరిగి పరీక్షను నిర్వహించబోతున్నారు. ఇప్పుడు ప్రధాని కార్యాలయం స్వయంగా పర్యవేక్షించడం చూస్తున్నాం. హెలికాప్టర్లు, విమానాలు, సిఆర్‌పిఎఫ్ బలగాల రక్షణలో పరీక్ష నిర్వహించ బోతున్నారు. నిజానికి పరీక్షకు ప్రిపేర్ అయి గతంలోనే రాసిన అనేకమంది ఇప్పుడు తమ భవిష్యత్ ఎలా ఉంటుందో అన్న గందరగోళంలో పడ్డారు. మానసికంగా వారు ఒత్తడికి గురవుతున్నారు. యూపిపిఎస్సీ పరీక్షను సక్రమంగా నిర్వహిస్తున్నప్పుడు నీట్ పరీక్షను ఎన్‌టిఎ ఎందుకు సరిగా నిర్వహించడం లేదని సుప్రీం కోర్టు గతంలోనే మొట్టి కాయలు వేసింది. నీట్ పరీక్షను పక్కాగా నిర్వహించడంలో విఫలం అయిన ఎన్‌టిఎపై చర్యలు తీసుకోకుండా విద్యార్థులపై ఒత్తిడి పెంచుతున్న తీరు సమస్యగా మారింది. ఇకపోతే 21న పరీక్షకు హాజరవుతున్న విద్యార్థులు నీట్–యూజీ పరీక్ష అడ్మిట్‌కార్డుల డౌన్‌లోడింగ్ పక్రియలో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అడ్మిట్‌కార్డులు నీట్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని ఆ పరీక్షను నిర్వహించే 'నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ' (ఎన్‌టీఏ) ఆదివారం ప్రకటించగానే.. విద్యార్థులు భారీ సంఖ్యలో వెబ్‌సైట్‌ను సందర్శించారు.

అయితే, పోర్టల్ తెరుచుకోవటానికి చాలా సమయం పడుతోందని, మధ్యలోనే నిలిచిపోతోందని, టైమ్‌ఔట్ ఎర్రర్స్‌ని చూపిస్తోందని అనేక మంది సోషల్ మీడియాలో పేర్కొన్నారు. నీట్ పేపర్ లీకేజీ, పరీక్షకు మళ్లీ సన్నద్ధం కావటంలో ఇప్పటికే తాము తీవ్రమైన మానసిక ఒత్తిడిలో ఉంటే.. ఈ సమస్యలు ఏమిటని అసహనం వ్యక్తం చేశారు. అడ్మిట్‌కార్డుల విషయంలో ఈ పరిస్థితి ఉంటే.. ఫీజు రిఫండ్ అంశంలోనూ సమస్యలు తలెత్తాయని తెలిపారు. రిఫండ్ కోసం తమ బ్యాంకు ఖాతా వివరాలు సమర్పించిన తర్వాత కూడా.. వివరాలు ఇవ్వలేదంటూ వెబ్‌సైట్‌లో కనిపించిందని పలువురు వెల్లడించారు. మరికొందరు, తమకు తెలియకుండా.. రిఫండ్ అవసరం లేదనే ఆప్షన్‌ను సెలక్ట్ చేశామని, రిఫండ్ కోసం ఈ ఆప్షన్‌ను ఎడిట్ చేసుకునే అవకాశం కల్పించాలని ఎన్‌టీఏకు విజ్ఞప్తులు చేశారు. అడ్మిట్‌కార్డుల కోసం ప్రత్యామ్నాయ విధానాలను కూడా అందుబాటులో ఉంచాలని, బ్యాంకుఖాతాల ధ్రువీకరణ పక్రియను సులభతరం చేయాలని పలువురు ఎన్‌టీఏకు సూచించారు. కాగా, ఈ ఫిర్యాదులపై ఎన్‌టీఏ సోమవారం స్పందిస్తూ.. విద్యార్థులు భారీ సంఖ్యలో సందర్శించటం వల్ల తమ సర్వర్లలో సాంకేతిక సమస్యలు తలెత్తాయని, వాటిని సరిదిద్దటానికి నిపుణులు పని చేస్తున్నారని పేర్కొంది. ఇప్పటికే 4 లక్షల మంది విద్యార్థులు అడ్మిట్ కార్డులను డౌన్‌లోడ్ చేసుకున్నట్లు తెలిపింది. పేపర్ లీకేజీ, తిరిగి పరీక్ష నిర్వహణ నేపథ్యంలో నీట్ విద్యార్థులకు ఫీజును రిఫండ్ చేస్తామని ఎన్‌టీఏ ప్రకటించిన విషయం తెలిసిందే. ఇదే అదునుగా.. ఓ సైబర్ నేరస్థుడు రిఫండ్‌ల మొత్తాన్ని తన ఖాతాకు మళ్లించుకున్నాడు. బిహార్‌లోని గయ జిల్లాకు చెందిన 19 ఏళ్ల నవీన్ యాదవ్ అనే వ్యక్తి నీట్ పోర్టల్‌లో నమోదు చేసుకున్న 150 మంది విద్యార్థుల అకౌంట్లను హ్యాక్ చేశాడు. రిఫండ్ కోసం ఆయా విద్యార్థులు ఇచ్చిన బ్యాంకు ఖాతాల వివరాల స్థానంలో తన బ్యాంకు ఖాతా వివరాలను నమోదు చేశాడు. తద్వారా ఒక్కో విద్యార్థికి రూ.1700 చొప్పున వచ్చిన రిఫండ్ మొత్తాన్ని తన ఖాతాకు మళ్లించాడు. దీనిపై ఓ విద్యార్థి తండ్రి నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు గుజరాత్‌లోని అహ్మదాబాద్ సైబర్ క్రైం బ్రాంచ్ పోలీసులు దర్యాప్తు చేయగా.. అసలు విషయం బయటపడింది. నవీన్ యాదవ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. మరోవైపు, నీట్ రీఎగ్జామ్ ప్రశ్నపత్రాలను అమ్ముతామంటూ విద్యార్థులు, తల్లిదండ్రులతో బేరసారాలు సాగిస్తున్న రాజస్థాన్‌కు చెందిన సుమేర్‌సింగ్ మీనా, ఆకాశ్‌మీనా అనే ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. టెలిగ్రాం ఛానళ్ల ద్వారా వీరు నీట్ ప్రశ్నపత్రాల గురించి ప్రచారం చేశారని, రూ.1.5 కోట్ల మేర లావాదేవీలు జరిపారని వెల్లడైంది. ఇదిలావుంటే ఈ గందరగోళం నేపథ్యంలో ఒక పరీక్ష నిర్వాణకు ఇంతగా హంగామా ఎందుకని తమిళనాడు బిజెపి మాజీ అధ్యక్షుడు, విశ్రాంత పోలీస్ అధికారి అన్నామలై ప్రశ్నించారు. పోలీసులు, హెలికాప్టర్ల వినియోగం వంటివన్నీ చేయడం, ప్రధాని కార్యాలయం సమీక్షించడం వంటివి వైఫల్యాలను ఎత్తి చూపుతున్నాయని అన్నారు. నీట్ పరీక్ష విషయంలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ వైఫల్యాలపై సమీక్షించాలి. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ అనుసరిస్తున్న తీరుగా పటిష్టం చేయాలి. లేదా నీట్‌ను ఎత్తివేయడం మంచిది..

## అవేం మాటలు..అమర్ నాథ్!

### క్షమాపణ చెప్పాలంటూ అధికార పక్షం డిమాండ్

### వ్యాఖ్యలకు కట్టుబడి ఉన్నానన్న అమర్‌నాథ్



అమరావతి, జూన్ 17: మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ నేత గుడివాడ అమర్‌నాథ్ హోంమంత్రి వంగలపూడి అనితను ఉద్దేశించి చేసిన మేకప్ మంత్రి అంటూ వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపాయి. అనకాపల్లి జిల్లా చోడవరం మండలం నరసయ్యపేటలో జరిగిన వైఎస్సార్‌సీపీ సభలో అనితను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు మహిళలను అవమానించేలా ఉన్నాయని అధికార పక్ష నేతలు మండిపడుతున్నారు. అయితే అమర్‌నాథ్ మాత్రం తాను చేసిన వ్యాఖ్యలకు కట్టుబడి ఉన్నానని, రాష్ట్రంలో శాంతిభద్రతల వైఫల్యాలపై ప్రశ్నలు లేవనెత్తినందుకే తన వ్యాఖ్యలను వక్రీకరించి అసలు సమస్యల నుంచి దృష్టి మళ్లిస్తున్నారని ఆరోపించారు. హోంమంత్రి అనిత కూడా స్పందిస్తూ ఒక దళిత మహిళ ఎదుగుదలను జీర్ణించుకోలేకే ఇలాంటి చౌకబారు వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ.. ప్రజల భద్రత కోసం పనిచేస్తున్న మహిళా మంత్రిని వ్యక్తిగతంగా లక్ష్యంగా చేసుకోవడం దురదృష్టకరమన్నారు. రాజకీయ విమర్శలు విధానాలపై ఉండాలని, వ్యక్తిత్వ హననం వైఎస్సార్‌సీపీ సంస్కృతికి నిదర్శనమని ఆరోపించారు. మహిళా నాయకులపై అనుచిత వ్యాఖ్యలు చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ అనితను రాజకీయంగా ఎదుర్కోలేకే వ్యక్తిత్వ హననానికి దిగారని విమర్శించారు. మహిళలపై ద్వేషంతోనే వైఎస్సార్‌సీపీ నేతలు వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించారు. రాజ్యసభ సభ్యుడు సానా సతీశ్ మాట్లాడుతూ కులాల మధ్య చిచ్చు పెట్టడమే జగన్ రాజకీయమని, అమర్‌నాథ్ బేషరతుగా హోంమంత్రి అనితకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మహిళల పట్ల వైఎస్సార్‌సీపీ నేతల చిన్నచూపుకు ఈ వ్యాఖ్యలే నిదర్శనమన్నారు. మహిళలను అవమానించే నేతలకు సమాజంలో స్థానం లేదని వ్యాఖ్యానించారు.మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే కాళ్లు విరగ్గొట్టడం తథ్యమని రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర హెచ్చరించారు. హోంమంత్రి వంగలపూడి అనితపై వైసీపీ నేత, మాజీ మంత్రి అమర్నాథ్ చేసిన వ్యాఖ్యలు అత్యంత సిగ్గుచేటని ఆయన మండిపడ్డారు.త ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో మహిళల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసిన నాయకత్వం ఇప్పుడు మహిళల గౌరవం గురించి మాట్లాడటం విడ్డూరమని విమర్శించారు. భార్య పేరుతో వ్యాపారాలు నిర్వహించి బియ్యం కుంభకోణాలకు పాల్పడిన వారు నీతులు చెప్పడం హాస్యాస్పదమని వ్యాఖ్యానించారు.

ఇదిలా ఉండగా ఎన్టీఆర్, పల్నాడు జిల్లాలకు చెందిన మహిళా నేతలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా కమిషన్కు ఫిర్యాదు చేసి అమర్‌నాథ్ వ్యాఖ్యలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. రాజకీయాల్లో విమర్శలు విధానాలు, నిర్ణయాలకే పరిమితం కావాలని, మహిళల వ్యక్తిత్వం, రూపురేఖలను లక్ష్యంగా చేసుకుని వ్యాఖ్యలు చేయడం సమాజానికి తప్పుడు సందేశాలు పంపుతుందని పేర్కొన్నారు. మహిళా సంఘాలు, తెలుగు మహిళ నేతలు రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేపట్టగా, మహిళా కమిషన్ ఈ అంశాన్ని సుమోటోగా స్వీకరించి తదుపరి చర్యలకు సిద్ధమవుతున్నట్లు సమాచారం.

## ఎల్‌నినో ప్రభావంతో మళ్లీ పెరిగిన ఉష్ణోగ్రతలు

### నైతురు ప్రవేశించినా కురియని చినుకులు

న్యూఢిల్లీ,జూన్17 : ఎల్‌నినో ప్రభావంతో దేశంలోని పలు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు పెరుగు తున్నాయి. తెలంగాణలో వచ్చే నాలుగు రోజుల పాటు తీవ్ర వడగాల్పులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. నైరుతి రుతుపవనాలు దేశంలోని మరిన్ని ప్రాంతాలకు విస్తరిస్తున్నప్పటికీ కనీసం మరో వారం రోజులపాటు విస్తృతమైన వర్షపాతం తక్కువగానే ఉండే అవకాశం ఉంది. జూన్ 23 ప్రాంతంలో పరిస్థితులు మెరుగుపడటం ప్రారంభమయ్యే వరకు వర్షాలు అంతంత మాత్రంగానే ఉంటాయని వాతావరణ పరిస్థితులు సూచిస్తున్నాయి. భారత్‌లోని మధ్య, తూర్పు ప్రాంతాల్లో రుతుపవనాల కదలిక సాంకేతికంగా కొనసాగుతున్నప్పటికీ వర్షాలను కురిపించే ఆ వ్యవస్థ అసాధారణంగా బలహీనంగా ఉందని వాతావరణ శాఖ అధికారులు పేర్కొన్నారు. జూన్ 15 నుంచి జూన్ 21 మధ్య రుతు పవనాల కార్యకలాపాలు పెద్దగా చురుకుగా ఉండకపోవచ్చని అంచనా. దీనివల్ల దేశంలోని అనేక ప్రాంతాల్లో ఇప్పటికే ఏర్పడిన వర్షపాత లోటు మరింత కొనసాగే అవకాశం ఉంది. రానున్న వారంలో విస్తృతమైన రుతుపవన వర్షాలకు బదులుగా ప్రధానంగా దక్షిణ భారతదేశంలో స్థానిక ఉరుములతో కూడిన వర్షాల ద్వారానే అధిక వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉంది. కర్ణాటక, ఆంధప్రదేశ్, తమిళనాడు సరిహద్దు ప్రాంతాలు, అలాగే తూర్పు కనుమల్లో తరచుగా ఉరుములతో కూడిన వాతావరణం ఏర్పడే అవకాశం ఉంది. దీనివల్ల అక్కడక్కడ మోస్తరు నుండి భారీ వర్షాలు, మెరుపులు, బలమైన గాలులు సంభవించే అవకాశం ఉంది. ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 9–10 రాష్ట్రాలపై ఎల్‌నినో తీవ్ర ప్రభావం చూపే అవకాశముందని.. ఆ రాష్ట్రాల్లోని జిల్లా అధికారులు, వ్యవసాయ సంస్థలతో సమన్వయ సమావేశాలు నిర్వహించాలని కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఆదేశించారు. వర్షపాతం తక్కువగా ఉన్న జిల్లాల కోసం ముందస్తు అత్యవసర ప్రణాళికలు సిద్ధం చేయటం, పత్తి, పప్పుధాన్యాల సాగు విస్తీర్ణాన్ని పెంచటం, రైతులకు శాస్త్రీయ సలహాలు అందేలా చూడటంపై దృష్టి సారించాలని ఆయన అన్నారు. ఖరీఫ్ 2026 సన్నాహకాలపై మంగళవారం సమీక్ష సమావేశానికి కేంద్ర మంత్రి చౌహాన్ అధ్యక్షత వహించారు.

## ఏపీలో బీచ్ షాక్స్‌కు గ్రీన్ సిగ్నల్..!

### సెప్టెంబర్ 1 నుంచి అమలు

### సూర్యలంక, విశాఖలో పైలట్ ప్రాజెక్ట్

అమరావతి,జూన్, 17; ఆంధ్రప్రదేశ్‌లో తీర ప్రాంత పర్యాటకాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం 'బీచ్ షాక్స్' విధానాన్ని ప్రవేశపెట్టింది. ఎక్సైజ్ శాఖ జారీ చేసిన జీవో నంబర్ 362 ప్రకారం, ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీటీడీసీ) గుర్తించిన ప్రదేశాల్లో పైలట్ ప్రాజెక్ట్‌గా బీచ్ షాక్స్ ఏర్పాటు చేయనున్నారు. ఈ విధానం రాష్ట్రంలోని 12 తీర ప్రాంత జిల్లాల్లో అమలుకానుండగా, సెప్టెంబర్ 1, 2026 నుంచి ఆగస్టు 31, 2029 వరకు అనుమతులు ఇవ్వడానికి నోటిఫికేషన్ జారీ చేశారు. మంత్రివర్గ ఉపసంఘం సిఫార్సుల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. మొదటి దశలో సూర్యలంక, విశాఖపట్నం బీచ్‌లలో బీచ్ షాక్స్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. ఏడాది పాటు పైలట్ ప్రాజెక్ట్ పనితీరును సమీక్షించిన తర్వాత ఇతర ప్రాంతాలకు విస్తరించాలా అనే అంశంపై నిర్ణయం తీసుకోనున్నారు.

మార్గదర్శకాల ప్రకారం షాక్స్ ఉదయం 10 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు మాత్రమే పనిచేయాలి. పర్యాటకుల భద్రత, నియంత్రణ కోసం ప్రత్యేక నిబంధనలు అమలు చేయనున్నారు. తక్కువ ఆల్కహాల్ శాతం ఉన్న పానీయాలకు మాత్రమే అనుమతి ఉండగా, భారత తయారీ విదేశీ మద్యం (ఐఎంఎఫ్ఎల్), ఫారిన్ లిక్కర్ విక్రయాలకు అనుమతి ఉండదని ఎక్సైజ్ శాఖ స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు మార్గదర్శకాలను అనుసరించి హైవే ప్రాంతాల్లో మద్యం విక్రయాలపై ఉన్న నిబంధనలను కూడా ఈ విధానంలో వర్తింపజేస్తున్నారు. పర్యావరణ పరిరక్షణ, భద్రత, పర్యాటక అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. బీచ్ షాక్స్ ద్వారా తీర ప్రాంతాల్లో కొత్త పర్యాటక ఆకర్షణలు ఏర్పడటంతో పాటు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని ప్రభుత్వం భావిస్తోంది. దేశీయ, విదేశీ పర్యాటకులను ఆకర్షించేలా ఆధునిక సదుపాయాలతో ఈ షాక్స్‌ను అభివృద్ధి చేయనున్నారు.

## హైదరాబాద్‌లో రోడ్డుకు ట్రంప్ పేరు సరికాదు

### ఒక నియంత పేరు పెట్టడం ఎంతవరకు సబబు

### సిఎం రేవంత్ నిర్ణయాన్ని తప్పుపట్టిన సిపిఎం

న్యూఢిల్లీ,జూన్17 : హైదరాబాద్‌లోని అమెరికా రాయ బార కార్యాలయం పక్కన ఉన్న రహదారికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేరు పెట్టాలన్న తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నిర్ణయాన్ని సిపిఐ (ఎం) జాతీయ ప్రధాన కార్యదర్శి ఎం.ఎ. బేబి తీవ్రంగా వ్యతిరేకించారు. ముఖ్యమంత్రి తీసుకున్న ఈ నిర్ణయంపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. గతంలో వియత్నాంపై అమెరికా యుద్ధం ఉధృతంగా సాగుతున్న సమయంలో, సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాట నేత హో చి మిన్ గౌరవార్థం కోల్‌కతాలోని అమెరికా రాయబార కార్యాలయం వెలుపల ఉన్న హారింగ్టన్ వీధికి ఆయన పేరు పెట్టారని ఈ సందర్భంగా బేబి గుర్తుచేశారు. కానీ ప్రస్తుత కాలంలో అమెరికా.. ఇరాన్‌పై యుద్ధ వాతావరణాన్ని సృష్టించడం, వెనిజులాలో సైనిక జోక్యానికి పాల్పడటం, క్యూబాపై ఆంక్షలతో దౌర్జన్యం చేయడం వంటి చర్యల ద్వారా మానవాళిపై సామ్రాజ్యవాద దురాక్రమణకు ప్రతీకగా నిలుస్తోందని ఆయన విమర్శించారు. నేటి కాలపు హిట్లర్‌లా మారాలని ఆకాంక్షిస్తున్న ట్రంప్‌ను గౌరవిస్తూ, తెలంగాణ ముఖ్యమంత్రి హైదరాబాద్‌లోని అమెరికా కాన్సులేట్ పక్కన ఉన్న రహదారికి ఆయన పేరు పెట్టాలని నిర్ణయించడం సరికాదని దుయ్యబట్టారు. ఇటీవల అమెరికా సైన్యం ఒక నిరాయుధ వాణిజ్య నౌకపై దాడి చేసి ముగ్గురు భారతీయ నావికులను హతమార్చిందని ఆయన ఆరోపించారు. అమెరికా ప్రభుత్వం ఇటువంటి దాడులను కొనసాగిస్తామని బెదిరిస్తున్నప్పటికీ, ఈ దారుణమైన క్షిపణి దాడిపై భారత ప్రభుత్వం తగిన రీతిలో నిరసన వ్యక్తం చేయలేదని, ప్రధాని నరేంద్ర మోదీ కూడా ఈ విషయంపై స్పందించడానికి నిరాకరించారని అన్నారు. దీన్నిబట్టి దేశ సార్వభౌమత్వాన్ని, ఆత్మగౌరవాన్ని వదులుకోవడానికి బిజెపికి ఎటువంటి సంకోచం లేదని స్పష్టమవుతోందని, ఇప్పుడు తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే బాటలో పయనిస్తున్నట్లు కనిపిస్తోందని విమర్శించారు.



## చంపాపేటలో అక్రమ పుస్తకాలు, యూనిఫాంల విక్రయాలపై
# అధికారుల కొరడా

**శ్రీ త్రివేణి స్కూల్‌లో నిల్వ గదిని సీజ్ చేసిన ఎంఈఓ కార్యాలయ అధికారులు**

హైదరాబాద్, జూన్ 17

రంగారెడ్డి జిల్లా సరూర్‌నగర్ మండలం చంపాపేటలోని శ్రీ త్రివేణి స్కూల్‌లో పుస్తకాలు, యూనిఫాంలను అక్రమంగా విక్రయిస్తున్నారనే ఆరోపణల నేపథ్యంలో అధికారులు చర్యలు చేపట్టారు. తనిఖీలు నిర్వహించిన ఎంఈఓ కార్యాలయ అధికారులు పుస్తకాలు, యూనిఫాంలు నిల్వ ఉంచిన గదిని సీజ్ చేశారు. స్థానికంగా అందిన ఫిర్యాదుల ఆధారంగా తెలంగాణ రాజ్యాధికార పార్టీ యువజన విభాగం ఈ విషయాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లింది. దీంతో ఎంఈఓ కార్యాలయం నుంచి అధికారులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని తనిఖీలు నిర్వహించారు. పరిశీలన అనంతరం పుస్తకాలు, యూనిఫాంలు నిల్వ చేసిన గదిని అధికారికంగా సీజ్ చేసి తదుపరి చర్యలకు ఉపక్రమించారు. ప్రజల ఫిర్యాదులపై వెంటనే స్పందించి చర్యలు తీసుకున్న అధికారులను తెలంగాణ రాజ్యాధికార పార్టీ యువజన విభాగం అభినందించింది. విద్యార్థులు, తల్లిదండ్రులపై అనవసర ఆర్థిక భారం మోపే విధానాలను అరికట్టాలని, విద్యను వ్యాపారంగా మార్చే ప్రయత్నాలను సహించబోమని పార్టీ నాయకులు హెచ్చరించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర యువజన అధ్యక్షుడు బొడ్డుపల్లి చంద్రశేఖర్ మాట్లాడుతూ, "ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడం మా బాధ్యత. అక్రమాలు ఎక్కడ జరిగినా వాటిపై చట్టబద్ధంగా పోరాడుతూ ప్రజల పక్షాన నిలబడతాం. విద్యార్థుల భవిష్యత్తు, తల్లిదండ్రుల హక్కుల పరిరక్షణ కోసం మా పోరాటం నిరంతరం కొనసాగుతుంది" అని పేర్కొన్నారు. విద్యాసంస్థల్లో నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు, యూనిఫాంల విక్రయాలు జరిగితే కఠిన చర్యలు తీసుకోవాలని స్థానిక తల్లిదండ్రులు, ప్రజా సంఘాలు కూడా అధికారులను కోరాయి.

# సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా వ్యర్థాల నిర్వహణ

**జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**

సూర్యాపేట జూన్ 17



పట్టణాల్లో ఘన వ్యర్థాల నిర్వహణ (సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్)ను మరింత పటిష్టం చేసి, సుప్రీంకోర్టు మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. పట్టణ పారిశుధ్యం, వ్యర్థాల నిర్వహణలో ఎలాంటి అలసత్వం సహించబోమని స్పష్టం చేశారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్, నేరేడుచర్ల, తిరుమలగిరి మున్సిపాలిటీల పరిధిలో ఎండ్-టు-ఎండ్ వ్యర్థాల సేకరణ, శానిటేషన్ ప్లాన్ అమలుపై జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి మున్సిపాలిటీ వద్ద శానిటేషన్ ప్లాన్‌కు సంబంధించిన సమగ్ర కార్యాచరణ ప్రణాళిక (యాక్షన్ ప్లాన్) సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. పట్టణాల్లో పారిశుధ్య నిర్వహణ, చెత్త సేకరణ, రీసైక్లింగ్ ప్రక్రియలను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. సూర్యాపేట మున్సిపాలిటీలో ప్రస్తుతం చెత్త సేకరణ విధానాన్ని సుప్రీంకోర్టు నిబంధనలకు అనుగుణంగా నాలుగు విభాగాలుగా నిర్వహిస్తున్నట్లు వివరించారు. గతంలో పొడి, తడి చెత్తను మాత్రమే వేరు చేసేవారని, ప్రస్తుతం కొత్త మార్గదర్శకాల ప్రకారం పొడి చెత్త, తడి చెత్త, శానిటరీ వ్యర్థాలు, స్పెషల్ కేర్ వ్యర్థాలు వేర్వేరుగా సేకరిస్తున్నట్లు తెలిపారు. చెత్త వర్గీకరణపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించేందుకు వార్డు సభలను సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు. ప్రస్తుతం సూర్యాపేటలో సుమారు 80 శాతం మేర చెత్తను వర్గీకరించి విజయవంతంగా సేకరిస్తున్నట్లు అధికారులు సమావేశంలో వివరించారు. ప్రతి వార్డులో చెత్త సేకరణ వాహనాలు అందుబాటులో ఉంచినట్లు అధికారులు తెలిపారు. పొడి, తడిచెత్త కలవకుండా వాహనాల్లో ప్రత్యేక విభాగాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. పట్టణంలో సేకరించిన వ్యర్థాల ప్రాసెసింగ్ కోసం రెండు డంపింగ్ యార్డులను వినియోగిస్తున్నట్లు తెలిపారు. ఇళ్ల నుంచి సేకరించిన వ్యర్థాలను జమ్మిగడ్డ యార్డుకు తరలించి అక్కడ ఏర్పాటు చేసిన ప్లాస్టిక్ షెడ్డులో రీసైక్లింగ్ ప్రక్రియ చేపడుతున్నట్లు వివరించారు. తడిచెత్త నుంచి వర్మీ కంపోస్ట్ తయారు చేస్తున్నట్లు తెలిపారు. పొడి వ్యర్థాల్లోని గాజు సీసాలు, ప్లాస్టిక్ వంటి స్క్రాప్ పదార్థాలను వేరు చేసి తరలించే బాధ్యతను ప్రైవేట్ ఏజెన్సీకి అప్పగించినట్లు అధికారులు వివరించారు. ఈ విధానంతో సూర్యాపేట మున్సిపాలిటీకి సంవత్సరానికి సుమారు రూ.7 లక్షల మేర అదనపు ఆదాయం సమకూరుతోందని తెలిపారు. ప్రతి డంప్‌యార్డ్‌కు ప్రత్యేక ఇన్‌ఛార్జ్ అధికారిని నియమించాలని, సేకరించిన ప్రతి వ్యర్థం రీసైక్లింగ్ లేదా శాస్త్రీయ డిస్పోజల్‌కు చేరేలా పూర్తి వ్యవస్థ రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు. తడిచెత్త, కూరగాయల వ్యర్థాల శాశ్వత పరిష్కారానికి బయో మిథనేషన్ ప్లాంట్లు అత్యంత ఉపయోగకరమని తెలిపారు. వీటి ద్వారా ఉత్పత్తి అయ్యే గ్యాస్‌ను వంట అవసరాలకు, వైకుంఠ ధామాల్లోని ఇన్సినరేటర్ల నిర్వహణకు వినియోగించవచ్చని సూచించారు. అదే విధంగా సూర్యాపేట, కోదాడ మున్సిపాలిటీల్లో మార్కెట్ ప్రాంతాల సమీపంలో బయో మిథనేషన్ ప్లాంట్ల ఏర్పాటుకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం రోజుకు సుమారు ఒక టన్ను వరకు ప్లాస్టిక్ వ్యర్థాలు సేకరించి పూర్తిస్థాయిలో ప్రాసెస్ చేస్తున్నట్లు సమావేశంలో వెల్లడించారు. ఈ ప్లాస్టిక్ వ్యర్థాల వినియోగానికి సిమెంట్ ఫ్యాక్టరీలు, పవర్ ప్లాంట్లతో ఒప్పందాలు కుదుర్చుకోవాలని సూచించారు. రవాణా ఖర్చులు తగ్గించే దిశగా సూర్యాపేట, కోదాడ మున్సిపాలిటీలు సంయుక్తంగా ప్లాస్టిక్ వ్యర్థాల నిల్వ కేంద్రాన్ని ఏర్పాటు చేసుకునేలా ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి హరి సింగ్ మున్సిపల్ కమిషనర్లు సూర్యాపేట కోదాడ తిరుమలగిరి హుజూర్నగర్ నేరేడుచర్ల హనుమంత రెడ్డి రమాదేవి నాగరాజు సతీష్ కుమార్ మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు



## ప్రత్యేక ఓటర్ జాబితా సవరణకు
# రాజకీయ నాయకులు సహకరించాలి

**జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**

సూర్యాపేట జూన్ 17

రాజకీయ పార్టీల ప్రతినిధులు క్షేత్రస్థాయిలో బీఎల్ఓలతో సమన్వయం చేసుకుంటూ, ఓటర్ల జాబితా ప్రక్షాళన విజయవంతం అయ్యేలా సహకరించాలని కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ కోరారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులకు రాజకీయ నాయకులు సహకరించాలని కోరారు. జూన్ 18న బూత్ లెవెల్ అధికారులు, అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి అధికారులకు క్షేత్రస్థాయి సన్నాహక శిక్షణ ఇస్తారని వివరించారు. జూన్ 25 - జూలై 24వరకు బీఎల్ఓలు ప్రతి ఇంటికీ తిరిగి ఎన్యుమరేషన్ ఫారాలను పంపిణీ చేసి వివరాలను సేకరిస్తారని, 2002 ఓటర్ల జాబితా ఆధారంగా కుటుంబ సభ్యుల వివరాలను ఇందులో నమోదు చేయాల్సి ఉంటుందని తెలిపారు. జూలై 24 - 30వరకు ప్రతి పోలింగ్ కేంద్రంలో గరిష్టంగా 1,200 మంది ఓటర్లు ఉండేలా పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రక్రియ చేపడతారన్నారు. ఓటర్ల ముసాయిదా జులై 31న జాబితా ప్రచురించి, అభ్యంతరాల స్వీకరణ అనంతరం అక్టోబర్ 1న తుది ఓటర్ల జాబితాను అధికారికంగా విడుదల చేస్తారని అన్నారు. ఎవరైనా తప్పు సమాచారం ఇస్తే నేరుగా పేరు తొలగించకుండా, ముసాయిదా జాబితా తర్వాత నోటీసు ఇచ్చి, విచారణ జరిపి చర్యలు తీసుకుంటారని పేర్కొన్నారు. వలస వెళ్లిన వారు, మరణించిన వారు, మరియు డూప్లికేట్ ఓటర్లను గుర్తించి జాబితా నుండి తొలగించడం జరుగుతుందని స్పష్టం చేశారు. ప్రజాప్రాతినిధ్య చట్టం, 1950 లోని సెక్షన్ 31 ప్రకారం, ఓటర్ల జాబితాలో పేరు నమోదు కోసం ఉద్దేశపూర్వకంగా తప్పుడు సమాచారం లేదా తప్పుడు డిక్లరేషన్ ఇస్తే ఒక సంవత్సరం జైలు శిక్ష, జరిమానా లేదా రెండు విధించే అవకాశం ఉందని తెలిపారు. ఓటర్ల జాబితా ప్రచురణ తేదీ అయిన 01-10-2026 నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని వెల్లడించారు. ఒక ప్రాంతం నుండి మరో ప్రాంతానికి మారిన వారు ఫామ్-8 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. హరిసింగ్, జిల్లా రెవిన్యూ అధికారి డి. ప్రేమ్ రాజ్, రాజేశ్వర్ రావు, అంజాద్, ఐ ఎన్ సి, కరుణాకర్ రెడ్డి, సత్యనారాయణ బిఆర్ఎస్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి జన్మదిన వేడుకలు

**కౌమార బాలికలకు ఆరోగ్యంపై అవగాహన**

**విద్యార్థినులకు హెల్త్ కిట్లు అందజేసిన మాజీ ఎంపీపీ యాతాకుల జ్యోతి**

కోదాడ జూన్ 17

కోదాడ శాసనసభ్యురాలు నలమాద ఉత్తమ్ పద్మావతి రెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని కోదాడ ప్రభుత్వ బాలికల పాఠశాలలో విద్యార్థినులకు ఆరోగ్యం, వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నడిగూడెం మాజీ ఎంపీపీ ఆతాకుల జ్యోతి మధుబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 200 మంది విద్యార్థినులకు శానిటరీ ప్యాడ్స్, సబ్బులు, నోటు పుస్తకాలు, పెన్నులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా యాతాకుల జ్యోతి మధుబాబు మాట్లాడుతూ సబ్బండ వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి ముందుకు సాగుతున్నారన్నారు. ఆడపిల్లలకు విద్య, ఆరోగ్యం రెండు కళ్లలాంటివని, వారు ఆరోగ్యంగా ఉన్నప్పుడే చదువులో రాణించగలరని పేర్కొన్నారు. ఆడపిల్ల చదువు ఆ తరానికే దిక్సూచి లాంటిదని, ఎమ్మెల్యే ఆలోచనలకు అనుగుణంగానే ఈ సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ఉత్తమ్ పద్మావతి ఇటువంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకొని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షిస్తూ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మలిదశ ఉద్యమ నాయకులు రాయపూడి వెంకటనారాయణ, తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి యాతాకుల మధుబాబు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.







## చిలుకూరు మండల విద్యాధికారిగా
# ఎన్.జి. శివకుమారి

చిలుకూరు, జూన్ 17

చిలుకూరు మండల విద్యాధికారి (ఎంఈవో)గా జెడ్పీహెచ్ఎస్ రామాపురం ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి ఎన్.జి. శివకుమారి నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖాధికారి శ్రీ అశోక్ నుంచి ఆమె నియామక ఉత్తర్వులను స్వీకరించారు. ప్రస్తుతం చిలుకూరు మండలంలోని జెడ్పీహెచ్ఎస్ రామాపురంలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తున్న శ్రీమతి శివకుమారి, విద్యారంగంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు. మండల విద్యాధికారిగా బాధ్యతలు స్వీకరించనున్న ఆమెకు విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, విద్యావేత్తలు, ప్రజాప్రతినిధులు అభినందనలు తెలిపారు.



# ఘనంగా పద్మావతి రెడ్డి జన్మదిన వేడుకలు

చిలుకూరు, జూన్ 17

చిలుకూరు మండల కేంద్రంలో స్థానిక శాసన సభ్యురాలు ఉత్తం పద్మావతి రెడ్డి పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కొల్లుపుల్లమ్మ నాగయ్య కేక్ కట్ చేసి సంబరాలు జరిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో మండల రూపు రేఖలు పూర్తిగా మారిపోయాయని ఎక్కడ చూసినా అభివృద్ధి కనిపిస్తుందని అన్నారు. ఎమ్మెల్యే ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రతినిత్యం ఏదో కార్యక్రమంలో ఉంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కీత వెంకటేశ్వర్లు, కార్యదర్శి పెంద్రాతి హనుమంతరావు, గ్రామ శాఖ అధ్యక్షుడు సొందు మియా, ఆర్యవైశ్య మండల అధ్యక్షుడు గరినే శేషగిరిరావు, నాయకులు నాగిరెడ్డి, పుల్లారావు, రమేష్, సైదిరెడ్డి కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## పోలవరం బ్యాక్‌వాటర్ ప్రభావిత తెలంగాణ గ్రామాలకు పూర్తి రక్షణ
**పీపీఏ హామీ**

హైదరాబాద్, జూన్ 17

పోలవరం ప్రాజెక్టు కారణంగా బ్యాక్‌వాటర్, ముంపు ప్రభావానికి గురయ్యే తెలంగాణ గ్రామాలకు పూర్తిరక్షణ కల్పిస్తామని పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) హామీ ఇచ్చింది. ఈ విషయమై మాజీ నీటిపారుదల శాఖ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్‌రావు వ్యక్తం చేసిన ఆందోళనలకు స్పందిస్తూ పీపీఏ అధికారికంగా ఈ మేరకు వెల్లడించింది. పునరుద్ధరణ (ఆర్‌అండ్‌ఆర్) నిబంధనల ప్రకారం భూములను సేకరించడం జరుగుతుందని పీపీఏ స్పష్టం చేసింది.

# ఆశాజ్యోతి ఫౌండేషన్ వారి వితరణ

చిలుకూరు, జూన్ 17

మండలంలోని బేతవోలు ఉన్నత పాఠశాల విద్యార్థులకు అమెరికాలోని ఆశాజ్యోతి ఫౌండేషన్ వారు 120 బ్యాగులు 1200 నోటు పుస్తకాలను విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి విద్యార్థుల ప్రగతికి తోడ్పాటును అందించి వారు అన్ని రంగాలలో ఎదగటానికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాగి గురవయ్య వారికి ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఆర్ఐలు వెలిగే కరుణాకర్, వంశీ, నందకుమార్ లతోపాటు గ్రామ సర్పంచ్ వట్టికూటి నాగయ్య ఉపసర్పంచ్ ఏడుకొండలు పిఏసిఎస్ డైరెక్టర్ చందా శ్రీనివాస్, కరుణాకర్ పాఠశాల ఉపాధ్యాయులు శౌరి, వెంకన్న, ఉపేందర్, కల్పన, శ్రీరామ్, కృష్ణ, నరసింహారావు మైసయ్య, లాల్, రాజ్యం తదితరులు పాల్గొన్నారు



# గచ్చిబౌలిలో ఓజ్రిట్ కార్యాలయాన్ని ప్రారంభించిన కేటీఆర్

హైదరాబాద్, జూన్ 17

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కే.టీ.రామారావు బుధవారం హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో ఓజ్రిట్ (రాఓతీఠ్) సంస్థ నూతన కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కేటీఆర్ సంస్థ కొత్త కార్యాలయాన్ని ప్రారంభించడంతో పాటు కంపెనీ లోగోను ఆవిష్కరించారు. అనంతరం ఓజ్రిట్ బృందంతో ముచ్చటించి, సంస్థ వ్యవస్థాపకుడు, సీఈఓ భరత్ గుప్త , సహ వ్యవస్థాపకుడు, సీఓఓ వివేకానంద రెడ్డిలతో సమావేశమై సంస్థ భవిష్యత్ ప్రణాళికలపై చర్చించారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకులు మాట్లాడుతూ, తెలంగాణను దేశంలోనే ప్రముఖ సాంకేతిక, ఆవిష్కరణల కేంద్రంగా తీర్చిదిద్దడంలో కేటీఆర్ చూపిన దూరదృష్టి, చేసిన కృషికి కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణలో సాంకేతిక రంగ అభివృద్ధికి కేటీఆర్ అందించిన ప్రోత్సాహమే ఓజ్రిట్ వంటి సంస్థలకు స్ఫూర్తిగా నిలిచిందని పేర్కొన్నారు. ఉపాధి కల్పనపై ఆయన చూపిన ప్రత్యేక దృష్టి తమలాంటి సంస్థలను తెలంగాణలోనే స్థాపించి అభివృద్ధి చెందేలా ప్రేరేపించిందన్నారు. సాంకేతికరంగ పర్యావరణ వ్యవస్థ అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని, రెండో శ్రేణి నగరాలకు విస్తరించడంతో పాటు రాబోయే సంవత్సరాల్లో సంస్థలో ఉద్యోగుల సంఖ్యను వెయ్యికి పైగా పెంచే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని వెల్లడించారు.



# జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం నేడు 'ఛలో హైదరాబాద్'

**తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల సమాఖ్య పిలుపు**

హైదరాబాద్, జూన్ 17

జర్నలిస్టుల సంక్షేమం, పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం జూన్ 18న భారీ స్థాయిలో 'ఛలో హైదరాబాద్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ ప్రకటించింది. సమాఖ్య వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య బుధవారం మాట్లాడుతూ, తెలంగాణ వ్యాప్తంగా ఉన్న జర్నలిస్టులు ఉదయం 10 గంటలకు హైదరాబాద్‌లోని గన్ పార్క్ వద్దకు చేరుకుని, అక్కడి నుంచి తమ డిమాండ్ల సాధనకోసం నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. రెండున్నర సంవత్సరాలుగా జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆయన ఆరోపించారు. ముఖ్యంగా చిన్న, మధ్య తరహా పత్రికలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వ ప్రకటనల బకాయిలు పెండింగ్‌లో ఉండటం, ప్రకటనల కేటాయింపులు తగ్గిపోవడం, జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేటాయింపులో జాప్యం, ఆరోగ్య బీమా, అక్రిడిటేషన్ సదుపాయాల లేమి వంటి సమస్యలు పరిష్కారం కోసం ఎదురుచూస్తున్నాయని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న ప్రకటనల బిల్లులను వెంటనే చెల్లించాలని, చిన్న పత్రికలకు క్రమం తప్పకుండా ప్రభుత్వ ప్రకటనలు ఇవ్వాలని, ముద్రణ సంస్థలకు భూములు, ఆర్థిక సహాయం అందించాలని సమాఖ్య డిమాండ్ చేసింది. అలాగే కేబుల్, ఐపీటీవీ వార్తా ఛానళ్ల జర్నలిస్టులకు అక్రిడిటేషన్ సౌకర్యాలను విస్తరించాలని, అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని, సీనియర్ జర్నలిస్టులకు పెన్షన్ సదుపాయం కల్పించాలని, మహిళా జర్నలిస్టులకు ప్రత్యేక సంక్షేమ చర్యలు చేపట్టాలని కోరింది.



# వట్‌పల్లి పోలీస్ స్టేషన్ సర్కిల్ కార్యాలయాల వార్షిక తనిఖీ

## సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని సమర్థవంతమైన పోలీసింగ్ అందించాలి

### జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్

సంగారెడ్డి, జూన్ 17

వార్షిక తనిఖీల్లో భాగంగా జిల్లా పోలీసు సూపరింటెండెంట్ పరితోష్ పంకజ్, ఐపీఎస్ బుధవారం వట్‌పల్లి పోలీస్ స్టేషన్‌తో పాటు జోగిపేట సర్కిల్ కార్యాలయాన్ని సందర్శించి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు సిబ్బంది గౌరవ వందనం స్వీకరించిన ఎస్పీ, డీఎస్పీతో కలిసి స్టేషన్ ఆవరణలో మొక్కను నాటారు. అనంతరం నూతన పోలీస్ స్టేషన్ భవన నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. స్టేషన్ ఆవరణ పరిశుభ్రత, సిబ్బంది బ్యారక్స్, రికార్డుల నిర్వహణ, కిట్ ఆర్టికల్స్‌ను తనిఖీ చేసిన ఆయన, శాఖ అందించిన సామగ్రిని జాగ్రత్తగా వినియోగించుకోవాలని సూచించారు. స్టేషన్‌లో స్వాధీనం చేసుకున్న వాహనాలు, కేసులకు సంబంధించిన రికార్డులను పరిశీలించి, ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు చేపట్టాలని ఆదేశించారు. మిస్సింగ్ కేసులు, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ఆస్తి సంబంధిత నేరాలు అధికంగా జరుగుతున్న ప్రాంతాలను బ్లాక్‌స్పాట్లుగా గుర్తించి పగలు, రాత్రి బీట్ విధుల్లో నిఘా పెంచాలని ఆదేశించారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించి, వారి సమస్యల పరిష్కారంపై విశ్వాసం కల్పించాలని సూచించారు. గ్రామ పోలీసు అధికారులు తమ పరిధిలోని గ్రామాలపై పూర్తి అవగాహన కలిగి ఉండి గ్రామ పెద్దలు, యువతతో సమన్వయం కొనసాగించాలని పేర్కొన్నారు.

**రౌడీషీటర్లు, హిస్టరీషీటర్ల వివరాలను ఎప్పటికప్పుడు నవీకరించాలని, అనుమానిత వ్యక్తుల వేలి ముద్రలను పోర్టబుల్ ఫింగర్‌ప్రింట్ పరికరాల ద్వారా పరిశీలించి పాత నేరస్తులను గుర్తించే చర్యలు చేపట్టాలని సూచించారు. సీసీటీఎన్ఎస్--2.0, టీఎస్-కాప్, హెచ్ఆర్ఎంఎస్, ఈ-సాక్ష్య, సైబర్ క్రైమ్ పోర్టల్, సీఈఐఆర్, పిటిషన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ తదితర ఆధునిక సాఫ్ట్‌వేర్ అప్లికేషన్లపై పూర్తి స్థాయి అవగాహన పెంపొందించుకుని నేరాల నియంత్రణలో సమర్థవంతంగా వినియోగించాలని సిబ్బందికి సూచించా రు. స్టేషన్ రికార్డులను ఎలాంటి పెండింగ్ లేకుండా సీసీటీఎన్ఎస్‌లో నమోదు చేయాలని, సిబ్బందికి విధులను వర్టికల్ వారీగా కేటాయించాలని స్టేషన్ హౌస్ ఆఫీసర్‌కు ఆదేశించారు. అనంతరం జోగిపేట సర్కిల్ కార్యాలయాన్ని సందర్శించిన ఎస్పీ, కార్యాలయ పరిశుభ్రత, రికార్డుల నిర్వహణను పరిశీలించారు. గ్రేవ్, నాన్-గ్రేవ్ కేసుల పురోగతిపై ఆరా తీసి, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసుల ఛేదన కోసం ప్రత్యేక బృందా లను ఏర్పాటు చేసి త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు.**

రోడ్డు ప్రమాదాల నివారణకు సమర్థవంతమైన చర్యలు చేపట్టి ప్రమాదాలు అధికంగా జరిగే ప్రాంతాలను బ్లాక్‌స్పాట్లుగా గుర్తించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జాతీయ రహదారి పరిసర గ్రామాల్లో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల ప్రాధాన్యాన్ని ప్రజలకు వివరించి, దాబాలు, పెట్రోల్ బంకులు, వ్యాపార సంస్థల వద్ద స్వచ్ఛందంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా ప్రోత్సహించాలని అన్నారు. సిబ్బందితో సమావేశమైన ఎస్పీ, మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని అన్ని రకాల విధులపై అవగాహన పెంపొం దించుకోవాలని సూచించారు. ప్రస్తుతం నేర్చుకుంటున్న నైపు ణ్యాలు సేవా కాలమంతా ఉపయోగపడతాయని పేర్కొన్నారు. విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసి పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలని, వ్యక్తిగత లేదా విధి సంబంధిత సమస్యలు ఉంటే నేరుగా తన దృష్టికి తీసు కురావచ్చని తెలిపారు. వాహనాలు నడిపే సమయంలో తప్పనిసరిగా హెల్మెట్, సీట్‌బెల్ట్ ధరించాలని సూచించిన ఆయన, హెల్మెట్ ధరించని సిబ్బందిని విధుల్లోకి అనుమతించవద్దని అధికారులకు ఆదేశిం చారు. పోలీస్ స్టేషన్, సర్కిల్ కార్యాలయాల నిర్వహణ, రికార్డుల నిర్వహణ సంతృ ప్తికరంగా ఉన్నాయని పేర్కొంటూ అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. ఈ తనిఖీలలో సంగారెడ్డి డీఎస్పీ సత్య య్య గౌడ్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అనిల్ కుమార్, వట్‌పల్లి ఎస్ఐ శ్రీహరి, జోగిపేట ఎస్ఐ శ్రీకాంత్ తదితర అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



# ఆరోగ్య కేంద్రాలను పరిశీలించిన వైద్య ఆరోగ్యశాఖ అధికారి

సంగారెడ్డి, జూన్ 17

జిల్లాలో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా చర్యలు చేపట్టాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె. లలితా దేవి సూచించారు. బుధవారం ఆమె పుల్కల్ నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (న్యూ పీహెచ్‌సీ) భవనాన్ని సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ పనుల నాణ్యత, మౌలిక సదుపాయాలు, విద్యుత్, తాగునీటి సౌకర్యాలు, పారిశుధ్య నిర్వహణ తదితర అంశాలను పరిశీలించి సంబంధిత అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని వివిధ రికార్డులు, జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలు తీరు, ఔషధ నిల్వలు, సిబ్బంది హాజరు రిజిస్టర్లు, నివేదికలను తనిఖీ చేసి రికార్డుల నిర్వహణను మరింత మెరుగుపరచాలని ఆదేశించారు. తదుపరి గొంగ్లూర్ ఉపకేంద్రాన్ని సందర్శించిన ఆమె గర్భిణీలు, బాలింతలు, శిశువులకు అందిస్తున్న ఆరోగ్య



సేవలు, టీకాకరణ కార్యక్రమం, కుటుంబ నియంత్రణ సేవలు, గ్రామస్థాయిలో అమలవుతున్న ఆరోగ్య కార్యక్రమాల పురోగతిని సమీక్షించారు. ఉపకేంద్రంలో అందుబాటులో ఉన్న సౌకర్యాలను పరిశీలించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేయాలని సిబ్బందికి సూచించారు. అనంతరం కంది ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని (పీహెచ్‌సీ) సందర్శించి ఓపీ సేవలు, ప్రయోగశాల (ల్యాబ్) సేవలు, ఔషధాల లభ్యత, మాతా--శిశు ఆరోగ్య సేవలు, పారిశుధ్య నిర్వహణతో పాటు రోగులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. వైద్య సిబ్బందితో సమావేశమై ప్రజలకు సత్వర, నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత వైద్య అధికారులు, సూపర్వైజర్లు, ఏఎన్ఎంలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

# కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర స్థాయి శిక్షణ తరగతులను విజయవంతం చేయాలి

### జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జంగన్న గౌడ్ పిలుపు

సంగారెడ్డి, 17

తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర స్థాయి శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జంగన్న గౌడ్ పిలుపునిచ్చారు. బుధవారం సంగారెడ్డిలోని ప్రజాసంఘాల కార్యాలయంలో జిల్లా ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ నెల 22, 23 తేదీల్లో హైదరాబాద్‌లోని జైసుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర స్థాయి శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని మండలాల అధ్యక్షులు, కార్యదర్శులు, కమిటీ సభ్యులు, జిల్లా కమిటీ సభ్యులు తప్పనిసరిగా ఈ శిక్షణలో పాల్గొనాలని కోరారు. ఈ శిక్షణ కార్యక్రమంలో కల్లుగీత వృత్తి ఆవిర్భావం, ఉద్యమ చరిత్ర, కల్లుగీత పారిశ్రామిక సహకార సంఘాల ఏర్పాటు, సర్దార్ సర్వాయి పాపన్న జీవిత చరిత్ర, ఇతర రాష్ట్రాల్లో కల్లుగీత వృత్తి పరిస్థితులు, తెలంగాణలో అమలవుతున్న



ప్రభుత్వ విధానాలు, ఎక్సైజ్ శాఖ, బీసీ కార్పొరేషన్ పాత్ర, ఈత-తాటి చెట్ల పెంపకం, కల్లుగీత వృత్తి పరిరక్షణకు ప్రభుత్వం చేపట్టాల్సిన చర్యలు, సంఘ నిర్మాణం తదితర కీలక అంశాలపై సమగ్ర అవగాహన కల్పిస్తామని వివరించా రు. కార్యకర్తలు ఈ అవకాశాన్ని సద్వి నియోగం చేసుకుని శిక్షణ తరగతుల్లో పాల్గొని సంఘాన్ని మరింత బలోే ఎతం చేయాలని తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం సంగారెడ్డి జిల్లా కమిటీ తరఫున విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. రమేష్ గౌడ్, జిల్లా కమిటీ సభ్యుడు రామా గౌడ్, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ యాదగౌడ్, సంగారెడ్డి అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, జిల్లా నాయకులు ప్రవీణ్ గౌడ్, కృష్ణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# నూతన అధికారులకు టీఎన్జీవోస్ సంఘం ఘన సన్మానం





### ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేస్తాం: అధికారులు

సంగారెడ్డి, జూన్ 17

టీఎన్జీవోస్ యూనియన్ సంగారెడ్డి జిల్లా శాఖ ఆధ్వర్యంలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ విజయలక్ష్మి, సంగారెడ్డి రూరల్ పోలీస్ స్టేషన్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్‌హెచ్‌వో) ఎం.డి.నయీంలను ఘనంగా సన్మానించారు. జిల్లా అధ్యక్షుడు ఎం.డి.జావిద్ అలీ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో నూతన అధికారులను శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ విజయలక్ష్మి మాట్లాడుతూ, ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ వారి సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఉద్యోగ సంఘాలతో సమన్వయం కొనసాగిస్తూ పరిపాలనను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు కట్టుబడి ఉంటానని పేర్కొన్నారు. సంగారెడ్డి రూరల్ ఎస్‌హెచ్‌వో ఎం.డి.నయీం మాట్లాడుతూ, ఉద్యోగ సంఘాలు, ఉద్యోగులతో సత్సంబంధాలు కొనసాగిస్తూ అన్ని విధాలా సహకారం అందిస్తామని తెలిపారు. ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని, భవిష్యత్తులో నిర్వహించే కార్యక్రమాలకు కూడా సమాచారం అందించాలని కోరారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ఎలాంటి వెనుకంజ వేయబోమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవోస్ జిల్లా కార్యదర్శి వేల్పూర్ రవి, అసోసియేట్ అధ్యక్షుడు పి.వెంకట్‌రెడ్డి, జిల్లా కోశాధికారి శ్రీనివాస్, రాష్ట్ర మహిళా కార్యదర్శి నిర్మల రాజకుమారి రాథోడ్, రాష్ట్ర నాయకుడు గౌస్, పంచాయతీ కార్యదర్శుల ఫోరం జిల్లా అధ్యక్షుడు, కార్యవర్గ సభ్యులు, కో-ఆపరేటివ్ శాఖ ఉద్యోగులు నాగేశ్వరరావు, రమేష్, నాలుగో తరగతి ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# మరమ్మతుల పనుల నేపథ్యంలో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేత

సంగారెడ్డి, జూన్ 17

11 కేవీ ఫ్రైడే మార్కెట్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల పనులు, చెట్ల కొమ్మల తొలగింపు కార్యక్రమం చేపట్టనున్న నేపథ్యంలో గురువారం (జూన్ 18) పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను తాత్కాలికంగా నిలిపివేయనున్నట్లు సంగారెడ్డి టౌన్--1 అసిస్టెంట్ ఇంజనీర్ (ఆపరేషన్) ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:00 గంటల వరకు, అలాగే మధ్యాహ్నం 2:30 గంటల నుంచి సాయంత్రం 5:00 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ సరఫరా నిలిచిపోయే ప్రాంతాల్లో రామ్‌నగర్, కింది బజార్, బ్రాహ్మణవాడ, కట్టకొమ్ము, నలంద నగర్, మాధవ నగర్, శ్రీనగర్, మారుతి నగర్, నేతాజీ నగర్, హనుమాన్ నగర్ ప్రాంతాలు ఉన్నాయి. మరమ్మతుల పనులు సకాలంలో పూర్తయ్యేందుకు విద్యుత్ వినియోగదారులు, ప్రజాప్రతినిధులు సహకరించాలని విద్యుత్ శాఖ అధికారులు విజ్ఞప్తి చేశారు.

# మోడీ పాలన 12 ఏళ్లు పూర్తి సందర్భంగా డ్రాయింగ్ పోటీలు

### విజేతలకు బహుమతుల ప్రదానం

### బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో కార్యక్రమం

సంగారెడ్డి, జూన్ 17

భారతీయ జనతా పార్టీ మహిళా మోర్చా కన్వీనర్ జ్యోత్స్న కొత్తపల్లి ఆధ్వర్యంలో, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం 12 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సంగారెడ్డి పట్టణంలోని గాంధీ సాంక్చువరీ స్కూల్‌లో విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబర్చిన విజేతలకు బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజి రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాజేశ్వరరావు దేశ్‌పాండే బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజి రెడ్డి మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశాభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న నాయకుడని పేర్కొన్నారు. ప్రజాసేవను అత్యున్నత ధ్యేయంగా తీసుకుని దేశాన్ని ప్రపంచంలో అగ్రస్థానంలో నిలిపేందుకు ఆయన అహర్నిశలు శ్రమిస్తున్నారని ఆమె అన్నారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించే ఇటువంటి కార్యక్రమాలు సమాజాభివృద్ధికి దోహదపడతాయని, భవిష్యత్తులోనూ ఇలాంటి కార్యక్రమాలను కొనసాగిస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు దోమల విజయ్ కుమార్, కసిని వాసు, అశోక్, తులసి ప్రకాష్ రెడ్డి, ప్రవీణ్ తదితర పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





## విప్రో--ఆంత్రోపిక్ భాగస్వామ్యం
# 10 వేల మందికి ఏఐ శిక్షణ

**బెంగళూరు, జూన్ 17**

భారతీయ సమాచార సాంకేతిక సేవల రంగంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. దేశంలోని ప్రముఖ సమాచార సాంకేతిక సంస్థ విప్రో, కృత్రిమ మేధ రంగంలో వేగంగా ఎదుగుతున్న ఆంత్రోపిక్ సంస్థతో వ్యూహాత్మక భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకుంది. ఈ భాగస్వామ్యంలో భాగంగా బెంగళూరులో ప్రత్యేక "ప్రతిభా కేంద్రం"ను ప్రారంభించింది. దీని ద్వారా ఆంత్రోపిక్ రూపొందించిన శక్తివంతమైన "క్లాడ్" కృత్రిమ మేధ వేదిక వినియోగాన్ని ప్రపంచవ్యాప్తంగా ఉన్న వ్యాపార సంస్థల్లో మరింత విస్తరించేందుకు చర్యలు చేపట్టనున్నారు. ఖాతాదారులకు అందించే డిజిటల్ సేవలను మరింత సమర్థవంతంగా మార్చడం, సరికొత్త పరిష్కారాలను అభివృద్ధి చేయడం ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యంగా సంస్థలు పేర్కొన్నాయి. ఈ కార్యక్రమంలో భాగంగా ఉద్యోగుల నైపుణ్యాభివృద్ధికి విప్రో ప్రాధాన్యత ఇస్తోంది. రాబోయే 18 నెలల్లో దాదాపు 10 వేల మంది ఉద్యోగులకు క్లాడ్ కృత్రిమ మేధ సాధనాలపై ఉన్నత స్థాయి శిక్షణ అందించాలని సంస్థ లక్ష్యంగా నిర్ణయించింది. సాఫ్ట్‌వేర్ అభివృద్ధి, సలహా సేవలు, యంత్ర అభ్యాస నిర్వహణ వంటి కీలక విభాగాల్లో ఈ శిక్షణ కొనసాగనుంది. కృత్రిమ మేధ సహాయంతో కోడింగ్ సామర్థ్యాన్ని పెంచడం, పనుల వేగాన్ని మెరుగుపరచడం, ఖాతాదారులకు మరింత నాణ్యమైన సేవలు అందించడం ద్వారా అంతర్జాతీయ పోటీలో ముందంజలో నిలవాలని విప్రో భావిస్తోంది. కొత్తగా ఏర్పాటు చేసిన ప్రతిభా కేంద్రం ద్వారా బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, బీమా, చిల్లర వ్యాపారం, టెలికాం రంగాల కోసం ప్రత్యేక కృత్రిమ మేధ పరిష్కారాలను రూపొందించనున్నారు.




## జియో ఐపీఓకు
# రంగం సిద్ధం

**ముంబై, జూన్ 17**

భారతీయ స్టాక్ మార్కెట్‌లో అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న జియో పబ్లిక్ షేర్ విక్రయ ప్రక్రియ తుది దశకు చేరుకున్నట్లు సమాచారం. టెలికాం రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన జియో ఇప్పుడు ప్రజా పరిమిత సంస్థగా మారేందుకు వేగంగా అడుగులు వేస్తోంది. సంస్థ వార్షిక సాధారణ సమావేశానికి ముందే మార్కెట్ నియంత్రణ సంస్థకు ప్రాథమిక పత్రాలు సమర్పించే అవకాశాలు ఉన్నాయని ఆర్థిక వర్గాలు పేర్కొంటున్నాయి. సమాచారం ప్రకారం, జియో వేదికలు దాదాపు రూ.33 వేల కోట్లకు పైగా విలువైన షేర్ విక్రయానికి సిద్ధమవుతున్నాయి. ఈ ప్రక్రియలో భాగంగా సమర్పించాల్సిన ప్రాథమిక ప్రతిపాదన పత్రాలను త్వరలో నియంత్రణ సంస్థకు అందజేయనున్నట్లు తెలుస్తోంది. ఈ షేర్ విక్రయం ద్వారా సమీకరించే నిధులను ప్రధానంగా కృత్రిమ మేధ సాంకేతిక వసతుల విస్తరణ, ఐదవ తరం మొబైల్ సేవల అభివృద్ధి, ఆర్థిక బాధ్యతల నిర్వహణ కోసం వినియోగించనున్నట్లు మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. అలాగే మాతృసంస్థలో ఇప్పటికే పెట్టుబడులు కలిగిన వాటాదారులకు ప్రత్యేక కేటాయింపులు ఉండే అవకాశమూ ఉందని చెబుతున్నారు. నిజానికి ఈ షేర్ విక్రయం గతంలోనే జరగాల్సి ఉన్నప్పటికీ అంతర్జాతీయ ఆర్థిక, భౌగోళిక పరిస్థితుల కారణంగా వాయిదా పడింది. ప్రపంచ మార్కెట్లలో నెలకొన్న అనిశ్చితి, అంతర్జాతీయ ఉద్రిక్తతలు, ఇంధన ధరల మార్పులు వంటి అంశాలు పెద్ద కంపెనీల షేర్ విక్రయ ప్రణాళికలను ప్రభావితం చేశాయి. ఈ నేపథ్యంలో సరైన సమయం కోసం సంస్థ వేచి చూసినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్లలో పరిస్థితులు క్రమంగా మెరుగుపడుతున్నాయి. పెట్టుబడిదారుల విశ్వాసం తిరిగి పెరుగుతుండటంతో భారీ షేర్ విక్రయాలకు అనుకూల వాతావరణం ఏర్పడుతోంది. ఈ పరిణామాల నేపథ్యంలో జియో షేర్ విక్రయం మళ్లీ చర్చనీయాంశంగా మారింది. మార్కెట్ విశ్లేషకుల అంచనాల ప్రకారం, సంస్థ విలువ లక్షల కోట్ల రూపాయల స్థాయిలో ఉండే అవకాశం ఉంది. ఇటీవల ప్రపంచవ్యాప్తంగా కొన్ని భారీ సంస్థల షేర్ విక్రయాలు విజయవంతం కావడం కూడా పెట్టుబడిదారుల్లో ఉత్సాహాన్ని పెంచింది. దీంతో జియో షేర్ విక్రయానికి దేశీయ, విదేశీ పెట్టుబడిదారుల నుంచి భారీ స్పందన లభించే అవకాశాలు ఉన్నాయని ఆర్థిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# పసిడి, వెండి ధరల్లో స్వల్ప తగ్గుదల

**హైదరాబాద్, జూన్ 17**

అంతర్జాతీయ మార్కెట్ల ప్రభావంతో దేశీయంగా బంగారం, వెండి ధరల్లో స్వల్ప తగ్గుదల నమోదైంది. ముడి చమురు ధరలు తగ్గడం, అమెరికా డాలర్ బలపడడం వంటి పరిణామాల కారణంగా పసిడి ధరలు క్రమంగా దిగివస్తున్నాయి. దీంతో బుధవారం దేశంలోని ప్రధాన నగరాల్లో బంగారం ధరలు స్వల్పంగా తగ్గాయి. హైదరాబాద్, విజయవాడ నగరాల్లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,51,100గా నమోదైంది. అదే 22 క్యారెట్ల 10 గ్రాముల ఆభరణాల బంగారం ధర రూ.1,38,500గా ఉంది. దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,51,250 కాగా, 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,38,650గా నమోదైంది.



మరోవైపు వెండి ధరలు కూడా తగ్గుముఖం పట్టాయి. కిలో వెండి ధరపై రూ.2,650 మేర తగ్గుదల కనిపించింది. ప్రస్తుతం హైదరాబాద్, విజయవాడ నగరాల్లో కిలో వెండి ధర రూ.2,75,000గా ఉంది. ఢిల్లీలో కిలో వెండి ధర రూ.2,65,000గా నమోదైంది. అలాగే చెన్నైలో కిలో వెండిధర రూ.2,75, 000 కాగా, బెంగళూరులో రూ.2,65,000గా ఉంది. అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితులు, భౌగోళిక రాజకీయ పరిణామాలు, డాలర్ మారకం విలువల ప్రభావంతో బంగారం, వెండి ధరలు రోజువారీగా మారుతున్నాయని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. పెట్టుబడిదారులు కొనుగోళ్లకు ముందు తాజా ధరలను పరిశీలించాలని సూచిస్తున్నారు.

# కొత్త హంగులతో మారుతి కార్లు..

**వరుసగా ఫేస్‌లిఫ్ట్ మోడళ్ల విడుదలకు సిద్ధం**

**న్యూఢిల్లీ, జూన్ 17**




దేశీయ వాహన రంగంలో అగ్రస్థానంలో ఉన్న మారుతి సుజుకి సంస్థ రాబోయే కాలంలో తన ప్రముఖ కార్లను సరికొత్త హంగులతో మార్కెట్లోకి తీసుకురావడానికి సిద్ధమవుతోంది. 2027 మార్చి నాటికి పలు నవీకరించిన మోడళ్లను విడుదల చేయాలని సంస్థ ప్రణాళికలు రూపొందించింది. ఇందులో బ్రెజ్జా, ఫ్రాంక్స్, గ్రాండ్ విటారా వంటి ప్రముఖ వాహనాలు ఉన్నాయి. ఇప్పటికే ఈ వాహనాల పరీక్షా ప్రక్రియ ప్రారంభమైనట్లు సమాచారం. బ్రెజ్జా ఫేస్‌లిఫ్ట్ మోడల్ వచ్చే కొన్ని నెలల్లోనే మార్కెట్లోకి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ వాహనంలో బాహ్య రూపకల్పనతో పాటు అంతర్గత భాగంలో కూడా గణనీయమైన మార్పులు చేయనున్నారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఇంజిన్‌లతో పాటు కొత్త టర్బో ఇంజిన్, ఆరు వేగాల గేర్‌బాక్స్‌ను అందించే అవకాశం ఉందని ఆటోమొబైల్ వర్గాలు పేర్కొంటున్నాయి. అలాగే వాహనంలో సిఎన్‌జీ ట్యాంక్‌ను అడుగు భాగంలో అమర్చడం ద్వారా ప్రయాణికులకు మరింత స్థలాన్ని కల్పించనున్నారు. ఫ్రాంక్స్ ఫేస్‌లిఫ్ట్ మోడల్‌లో అత్యాధునిక భద్రతా సాంకేతికతలను అందించనున్నారు. రాడార్ ఆధారిత డ్రైవర్ సహాయక వ్యవస్థ, స్వయంచాలక అత్యవసర బ్రేకింగ్, వేగ నియంత్రణ వంటి సదుపాయాలు ఉండనున్నాయి. అంతేకాకుండా సంస్థ స్వయంగా అభివృద్ధి చేసిన బలమైన హైబ్రిడ్ వ్యవస్థను ఇందులో ప్రవేశపెట్టనున్నట్లు తెలుస్తోంది. దీనివల్ల ఇంధన వినియోగం గణనీయంగా తగ్గి, అధిక మైలేజీ లభించే అవకాశం ఉంది.




## రూ.25 వేల కోట్లకు
# పిజ్జా హట్ విక్రయం


**న్యూయార్క్, జూన్ 17**

ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన పిజ్జా హట్ రెస్టారెంట్ శ్రేణి యాజమాన్యంలో కీలక మార్పు చోటు చేసుకోనుంది. పిజ్జా హట్‌తో పాటు ప్రముఖ ఆహార బ్రాండ్లను నిర్వహిస్తున్న యమ్ బ్రాండ్స్ సంస్థ, పిజ్జా హట్ వ్యాపారాన్ని మొత్తం 2.7 బిలియన్ డాలర్లకు, భారత కరెన్సీలో సుమారు రూ.25 వేల కోట్లకు విక్రయిస్తున్నట్లు ప్రకటించింది. ఒప్పందం ప్రకారం, చైనా మినహా ప్రపంచవ్యాప్తంగా ఉన్న పిజ్జా హట్ కార్యకలాపాలను లాంగ్‌రేంజ్ క్యాపిటల్ అనే ప్రైవేట్ పెట్టుబడి సంస్థ 1.5 బిలియన్ డాలర్లకు కొనుగోలు చేయనుంది. మరోవైపు, చైనాలో ఉన్న 4,375 పిజ్జా హట్ రెస్టారెంట్లను యమ్ చైనా హోల్డింగ్స్ సంస్థ 1.2 బిలియన్ డాలర్లకు స్వాధీనం చేసుకోనుంది. గత కొన్నేళ్లుగా పిజ్జా హట్ వ్యాపారం అనేక దేశాల్లో ఒడిదుడుకులు ఎదుర్కొంటోంది. పెరుగుతున్న ద్రవ్యోల్బణం, ముడి పదార్థాల ధరల పెరుగుదల, వినియోగదారుల ఆహారపు అలవాట్లలో మార్పులు సంస్థ ఆదాయంపై ప్రభావం చూపాయి. ముఖ్యంగా అమెరికా మార్కెట్లో అమ్మకాలు ఆశించిన స్థాయిలో లేకపోవడంతో వ్యాపార పునర్వ్యవస్థీకరణ అవసరమైంది. అయితే చైనా మార్కెట్లో మాత్రం పిజ్జా హట్ గణనీయమైన వృద్ధిని నమోదు చేసింది. స్థానిక వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా ప్రత్యేక వంటకాలను అందించడం, కొత్త తరహా రెస్టారెంట్ నమూనాలను ప్రవేశపెట్టడం ద్వారా అక్కడి వ్యాపారం బలంగా కొనసాగుతోంది.

## ఆండ్రాయిడ్
# 17 విడుదల

**మౌంటెన్ వ్యూ, జూన్ 17**

ప్రపంచ ప్రఖ్యాత సాంకేతిక సంస్థ గూగుల్ తన తాజా మొబైల్ నిర్వహణ వ్యవస్థ 'ఆండ్రాయిడ్ 17'ను అధికారికంగా విడుదల చేసింది. జూన్ 16 నుంచి ఈ నవీకరణ గూగుల్ పిక్సెల్ 6 మరియు ఆ తర్వాతి మోడళ్లలో అందుబాటులోకి వచ్చింది. ఇతర ప్రముఖ స్మార్ట్‌ఫోన్ తయారీ సంస్థలైన శామ్‌సంగ్, వన్‌ప్లస్ తదితర బ్రాండ్ల వినియోగదారులకు ఈ నవీకరణ దశలవారీగా 2026 చివరి నాటికి అందుబాటులోకి రానుంది. కొత్త ఫీచర్లతో వినియోగదారుల అనుభవాన్ని మరింత మెరుగుపరచడంపై గూగుల్ ప్రత్యేక దృష్టి సారించింది. ఈ కొత్త వెర్షన్‌లో అత్యంత ఆకర్షణీయమైన ఫీచర్‌గా తేలియాడే అనువర్తన విండోలు నిలిచాయి. ఇప్పటివరకు సందేశాల అనువర్తనాలకు మాత్రమే పరిమితమైన ఈ సదుపాయాన్ని ఇప్పుడు అన్ని అనువర్తనాలకు విస్తరించారు. ప్రధాన తెరపై ఏదైనా అనువర్తనాన్ని నొక్కి ఉంచడం ద్వారా దానిని చిన్న తేలియాడే విండో రూపంలో ఉపయోగించుకోవచ్చు. ముఖ్యంగా టాబ్లెట్లు, మడత తెర ఫోన్ల కోసం ప్రత్యేకంగా రూపొందించిన తేలియాడే పట్టీ ద్వారా ఒకేసారి అనేక పనులను నిర్వహించే అవకాశం కల్పించారు. కంటెంట్ సృష్టికర్తలను దృష్టిలో ఉంచుకుని తెర ప్రతిస్పందనల అనే కొత్త సదుపాయాన్ని కూడా ప్రవేశపెట్టారు. తెర రికార్డింగ్ సమయంలో ఫోన్ తెరతో పాటు ముందుభాగ కెమెరా ద్వారా వినియోగదారి ముఖాన్ని కూడా ఒకేసారి రికార్డ్ చేయవచ్చు.




# భారత్ నుంచి వెళ్లగొట్టడం బాధాకరం: సెలెబీ సంస్థ

**జూన్ 17**

భారత విమానాశ్రయాల్లో భూసేవలు, సరుకు రవాణా నిర్వహణలో కీలక పాత్ర పోషించిన టర్కీకి చెందిన సెలెబీ సంస్థ, దేశం నుంచి నిష్క్రమించిన తర్వాత తొలిసారిగా స్పందించింది. తమకు మంజూరైన భద్రతా అనుమతులను కేంద్ర ప్రభుత్వం రద్దు చేయడంతో దాదాపు రెండు దశాబ్దాలుగా నిర్మించుకున్న వ్యాపారం ఒక్కసారిగా కూలిపోయిందని సంస్థ చైర్‌పర్సన్ జానన్ సెలెబియోగ్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నిర్ణయం కారణంగా వేల కోట్ల రూపాయల విలువైన వ్యాపారాన్ని కోల్పోయామని ఆమె పేర్కొన్నారు. ఢిల్లీ, ముంబై, హైదరాబాద్, బెంగళూరు సహా దేశంలోని తొమ్మిది ప్రధాన విమానాశ్రయాల్లో సేవలు అందించిన ఈ సంస్థపై 2025 మే 15న పౌర విమానయాన భద్రతా విభాగం నిషేధం విధించింది. నిషేధం అమల్లోకి వచ్చిన వెంటనే సంస్థ కార్యకలాపాలు నిలిచిపోయాయని, కోట్ల రూపాయల విలువైన పరికరాలు, ఆస్తులు ప్రభుత్వ నియంత్రణలోకి వెళ్లాయని జానన్ సెలెబియోగ్లు తెలిపారు. భారతదేశంలో ఎంతో కష్టపడి నిర్మించిన వ్యాపార సామ్రాజ్యం ఒక్క రోజులోనే అంతరించిపోవడం తీవ్ర నిరాశకు గురిచేసిందన్నారు.



అయితే సంస్థలో పనిచేస్తున్న దాదాపు పది వేల మంది ఉద్యోగులకు ఇబ్బంది కలగకుండా కేంద్ర ప్రభుత్వం ఇతర సంస్థల్లో వారికి ఉపాధి కల్పించడం జరిగింది. సంస్థకు ఎలాంటి రాజకీయ సంబంధాలు లేవని, తాము పూర్తిగా వాణిజ్యపరమైన సంస్థ మాత్రమేనని సెలెబీ యాజమాన్యం వాదిస్తోంది. అయినప్పటికీ భారత్--టర్కీ మధ్య నెలకొన్న రాజకీయ, భద్రతా ఉద్రిక్తతల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు.




## స్పేస్‌ఎక్స్ విలువ
# దూసుకెళ్తుందా?

**హైదరాబాద్, జూన్ 17**

అంతరిక్ష సాంకేతిక రంగంలో అగ్రగామిగా నిలిచిన స్పేస్‌ఎక్స్ సంస్థ మార్కెట్ విలువపై అంతర్జాతీయ ఆర్థిక వర్గాల్లో చర్చ కొనసాగుతోంది. అయితే స్పేస్‌ఎక్స్ ఇప్పటికే స్టాక్ మార్కెట్‌లో నమోదైందని, ప్రారంభ షేర్ల విక్రయం నిర్వహించిందని వస్తున్న ప్రచారాలపై స్పష్టత అవసరం. ప్రస్తుతం స్పేస్‌ఎక్స్ పబ్లిక్ కంపెనీ కాదు. అందువల్ల షేర్లు సాధారణ స్టాక్ మార్కెట్‌లో కొనుగోలు, విక్రయాలకు అందుబాటులో లేవు. అయినప్పటికీ ప్రైవేట్ పెట్టుబడి లావాదేవీలు, ద్వితీయ మార్కెట్ ఒప్పందాల ఆధారంగా సంస్థ విలువ గణనీయంగా పెరుగుతున్నట్లు అంచనాలు వ్యక్తమవుతున్నాయి. సంస్థ విలువపై వెలువడుతున్న తాజా అంచనాల ప్రకారం స్పేస్‌ఎక్స్ మార్కెట్ విలువ ట్రిలియన్ డాలర్ల స్థాయికి చేరువవుతోందని విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఉపగ్రహ ఆధారిత అంతర్జాల సేవల సంస్థ స్టార్‌లింక్ వేగంగా విస్తరించడం, పునర్వినియోగ రాకెట్ సాంకేతికతలో సాధించిన పురోగతి, అంతరిక్ష ప్రయోగాల్లో పెరుగుతున్న వాణిజ్య అవకాశాలు సంస్థపై పెట్టుబడిదారుల విశ్వాసాన్ని మరింత పెంచుతున్నాయి. ఈ కారణాల వల్లే స్పేస్‌ఎక్స్ ప్రపంచంలోని అత్యంత విలువైన ప్రైవేట్ సంస్థలలో ఒకటిగా కొనసాగుతోంది. అంతరిక్ష ప్రయోగాల వ్యయాన్ని తగ్గించడంలో స్పేస్‌ఎక్స్ కీలక పాత్ర పోషిస్తోంది. ఫాల్కన్ రాకెట్లు, స్టార్‌షిప్ ప్రాజెక్టు, స్టార్‌లింక్ సేవలు సంస్థ భవిష్యత్ ఆదాయ వనరులుగా భావిస్తున్నారు. కృత్రిమ మేధ, అంతరిక్ష సమాచార సేవలు, ఉపగ్రహ కమ్యూనికేషన్ రంగాల్లో విస్తరణ కూడా సంస్థ వృద్ధికి దోహదపడుతోంది. ఈ నేపథ్యంలో ప్రపంచ ఆర్థిక రంగం స్పేస్‌ఎక్స్ భవిష్యత్ అడుగులపై ఆసక్తిగా ఎదురుచూస్తోంది. అయితే సంస్థ అధికారికంగా స్టాక్ మార్కెట్‌లో నమోదు కాలేదు కాబట్టి, ఐపీఓ, షేరు ధరల పెరుగుదల, అమెజాన్‌ను మార్కెట్ విలువలో అధిగమించిందనే ప్రచారాలను పెట్టుబడిదారులు జాగ్రత్తగా పరిశీలించాల్సిన అవసరం ఉందని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు.



## భారత్‌లోకి 2026
# నింజా 500

**న్యూఢిల్లీ, జూన్ 17**

ప్రముఖ ద్విచక్ర వాహన తయారీ సంస్థ కవాసాకీ భారత మార్కెట్లో 2026 నింజా 500 స్పోర్ట్స్ బైక్‌ను విడుదల చేసింది. ఈ కొత్త మోడల్ ఎక్స్‌షోరూమ్ ధరను రూ.5.76 లక్షలుగా నిర్ణయించింది. పర్యావరణ అనుకూల ఇంధన వినియోగాన్ని ప్రోత్సహించే దిశగా ఈ బైక్‌ను ఈ20 ఇంధనానికి అనుకూలంగా రూపొందించడం విశేషం. ఇటీవల ఈ మోడల్ విక్రయాలు నిలిపివేస్తారన్న ప్రచారం జరిగినప్పటికీ, తాజా వెర్షన్‌ను ప్రవేశపెట్టి ఆ ఊహాగానాలకు సంస్థ ముగింపు పలికింది. కొత్త నింజా 500లో ప్రధాన ఆకర్షణ ఈ20 ఇంధన మద్దతు. 20 శాతం ఇథనాల్ కలిగిన పెట్రోల్‌తో కూడా బైక్‌ను సులభంగా నడపవచ్చు. పర్యావరణ పరిరక్షణకు అనుగుణంగా రూపొందించిన ఈ మార్పు భవిష్యత్ ఇంధన అవసరాలను దృష్టిలో ఉంచుకుని తీసుకువచ్చినదిగా కంపెనీ పేర్కొంది. అలాగే కవాసాకీకి ప్రత్యేక గుర్తింపుగా నిలిచిన ఆకర్షణీయమైన లైమ్ గ్రీన్ రంగును కూడా కొత్త మోడల్‌లో అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇంజిన్ పరంగా ఎలాంటి మార్పులు చేయకుండా, గత మోడల్‌లో ఉన్న 451 సీసీ లిక్విడ్ కూల్డ్ ప్యారలల్ ట్విన్ ఇంజిన్‌ను కొనసాగించింది. ఈ ఇంజిన్ గరిష్టంగా 45 హార్స్‌పవర్ శక్తి, 42.6 న్యూటన్ మీటర్ల టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. దీనికి 6-స్పీడ్ గేర్‌బాక్స్‌ను జత చేయగా, అసిస్ట్ అండ్ స్లిప్పర్ క్లచ్‌ను ప్రామాణిక ఫీచర్‌గా అందించింది.

# కోపం కంటే పరిష్కారానికే ప్రాధాన్యం నాగ్ అశ్విన్

హైదరాబాద్, జూన్ 17

తెలుగు సినీ పరిశ్రమలో వినూత్న చిత్రాలతో ప్రత్యేక గుర్తింపు పొందిన దర్శకుడు నాగ్ అశ్విన్ తన పని విధానం గురించి ఆసక్తికర విషయాలను వెల్లడించారు. ప్రముఖ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు రూపొందించిన 'సింగ్ గీతం' సినిమా ప్రచార కార్యక్రమాల్లో పాల్గొంటున్న సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. భారీ బడ్జెట్ చిత్రాల చిత్రీకరణ సమయంలో ఒత్తిడి, ఉద్రిక్తతలు సహజమేనని పేర్కొన్న ఆయన, అలాంటి పరిస్థితుల్లో యూనిట్ సభ్యులపై కోపం ప్రదర్శించడం తనకు ఇష్టం ఉండదని స్పష్టం చేశారు. సినిమా నిర్మాణ ప్రక్రియలో దర్శకుడు కోపంతో ప్రవర్తిస్తే సెట్స్‌లోని వాతావరణం దెబ్బతింటుందని నాగ్ అశ్విన్ తెలిపారు. దాని ప్రభావం నేరుగా పనితీరుపై పడటమే కాకుండా, కొన్ని సందర్భాల్లో మళ్లీ చిత్రీకరణలు చేయాల్సిన పరిస్థితులు కూడా తలెత్తవచ్చని చెప్పారు. అందుకే సమస్యలను గుర్తించి వాటికి పరిష్కారాలు కనుగొనడంపైనే తాను ఎక్కువ దృష్టి పెడతానని వెల్లడిం చారు.ఒక సినిమా విజయవంతంగా పూర్తికావ డంలో ప్రతి సిబ్బంది పాత్ర ఎంతో కీలకమని ఆయన పేర్కొన్నారు.



# విష్ణుప్రియ వ్యాఖ్యలు వైరల్

హైదరాబాద్, జూన్ 17

బుల్లితెర యాంకర్, నటి విష్ణుప్రియ భీమినేని మరోసారి సామాజిక మాధ్యమాల్లో చర్చనీ యాంశంగా మారింది. షార్ట్ ఫిలిమ్స్‌తో తన ప్రయాణాన్ని ప్రారంభించిన ఆమె, పలు టెలివిజన్ కార్యక్రమాలు, సినిమాల ద్వారా ప్రేక్షకులకు చేరువైంది. అనంతరం ప్రముఖ రియాలిటీ షోలో పాల్గొని మరింత గుర్తింపు సంపాదించింది. అయితే నటనా ప్రస్థానం కంటే ఎక్కువగా ఆమె చేసే పోస్టులు, వ్యక్తిగత వ్యాఖ్యలే తరచూ వార్తల్లో నిలుస్తున్నాయి. ఇటీవల ఆమె నిర్వహిస్తున్న చెల్లింపు సభ్యత్వ సేవలపై విస్తృత చర్చ సాగింది. ప్రత్యేక సభ్యులకు మాత్రమే అందించే విషయాలపై కొందరు అభ్యంతరాలు వ్యక్తం చేయగా, మరికొందరు సామాజిక మాధ్యమాల్లో విమర్శలు గుప్పించారు. ఈ నేపథ్యంలో తనపై తప్పుడు ప్రచారం జరుగుతోందని ఆరోపిస్తూ కొన్ని సామాజిక మాధ్యమ ఖాతాలు, వీడియో వేదికలపై ఆమె ఫిర్యాదులు కూడా చేసినట్లు తెలిసింది. తన ప్రతిష్ఠకు భంగం కలిగించే విధంగా ప్రచారం చేస్తున్నారని ఆమె పేర్కొంది. ఈ వివాదాలు కొనసాగుతున్న సమయంలోనే తాజాగా ఆమె నిర్వహించిన ప్రత్యేక ప్రత్యక్ష ప్రసార కార్యక్రమంలో చేసిన వ్యాఖ్యలు మరోసారి చర్చకు దారితీశాయి. చెల్లింపు సభ్యత్వం పొందిన అనుచరులతో మాట్లాడిన సందర్భంగా అభిమానులు అడిగిన పలు ప్రశ్నలకు ఆమె సమాధానాలు ఇచ్చింది. ఈ క్రమంలో ఒక వ్యక్తిగత ప్రశ్నకు స్పందించిన ఆమె ఇచ్చిన సమాధానం సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం పొందుతోంది. ఈ వ్యాఖ్యల నేపథ్యంలో అనుకూల, ప్రతికూల స్పందనలు వ్యక్తమ వుతున్నాయి. కొందరు ఆమె నిజాయితీని అభినందిస్తుండగా, మరికొందరు వ్యక్తిగత విషయాలను బహిరంగంగా ప్రస్తావించడం అవసరమా అని ప్రశ్నిస్తున్నారు. ఈ వ్యవహారంపై స్పందించిన విష్ణుప్రియ, "నిజాయితీగా మాట్లాడినందుకు తాను ఎప్పుడూ బాధపడనని" స్పష్టం చేసింది.





# నటి సునయన ప్రేమకు బ్రేకప్? ఫొటోలు తొలగించడంతో చర్చ

చెన్నై, జూన్ 17

సినీ పరిశ్రమలో ప్రేమ, నిశ్చితార్థం, విడిపోవడం వంటి అంశాలు తరచూ వార్తల్లో నిలుస్తుంటాయి. తాజాగా నటి సునయన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ఓ విషయం సామాజిక మాధ్యమాల్లో చర్చనీయాంశంగా మారింది. తన నిశ్చితార్థానికి సంబంధించిన చిత్రాలను సామాజిక మాధ్యమ ఖాతా నుంచి తొలగించడంతో ఆమె ప్రేమ బంధం ముగిసిందనే ఊహాగానాలు జోరందుకున్నాయి.తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో పలు చిత్రాల్లో నటించి గుర్తింపు పొందిన సునయన, ఇటీవల విడుదలైన కుబేర చిత్రంలో కీలక పాత్ర పోషించింది. గత ఏడాది నుంచి విదేశాలకు చెందిన ఓ వ్యాపారవేత్తతో ఆమె ప్రేమలో ఉన్నట్లు ప్రచారం జరిగింది. కొద్ది నెలల క్రితం నిశ్చితార్థానికి సంబం ధించిన సంకేతాలు ఇస్తూ కొన్ని చిత్రాలను సామాజిక మాధ్యమాల్లో పంచుకోవడంతో అభిమానులు శుభాకాంక్షలు తెలిపారు. అయితే ప్రస్తుతం ఆమె తన ఖాతా నుంచి నిశ్చితార్థానికి సంబంధించిన చిత్రాలతో పాటు ప్రియుడికి సంబంధించిన పోస్టులను కూడా తొలగించింది. దీంతో వీరిద్దరి మధ్య విభేదాలు తలెత్తి ఉండవచ్చని సినీ వర్గాల్లో ప్రచారం సాగుతోంది. పెళ్లి దశకు చేరుకున్న ఈ బంధం అకస్మాత్తుగా ఎందుకు మారిందనే అంశంపై స్పష్టత లేకపో యినా, ఈ చర్యతో విడిపోయారనే ఊహాగానాలు మరింత బలపడుతున్నాయి. అయితే ఈ విషయంపై సునయన ఇప్పటి వరకు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. అందువల్ల ప్రస్తుతం వెలువడుతున్న సమాచారం అంతా ఊహాగానాల స్థాయిలోనే ఉందని సినీ వర్గాలు ఎర్కొం టున్నాయి. నాగ్‌పూ ర్‌కు చెందిన సునయన కన్నడ చిత్రరంగం ద్వారా నటిగా పరిచయమై, తరువాత తెలుగు చిత్రసీమలో అడుగుపెట్టింది. అనంతరం పలు భాషల్లో నటిస్తూ తన కంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుంది.

# చికిరి చికిరి వీడియో విడుదల చరణ్ స్టెప్పులకు ఫ్యాన్స్ ఫిదా

హైదరాబాద్, జూన్ 17

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ హీరోగా, జాన్వీ కపూర్ కథానాయికగా నటించిన సూపర్ హిట్ చిత్రం 'పెద్ది' నుంచి చిత్రబృందం మరో క్రేజీ అప్‌డేట్‌ను అందించింది. ఈ చిత్రంలోని 'చికిరి చికిరి' పాట పూర్తి వీడియోను తాజాగా విడుదల చేసింది. విడుదలైన వీడియోలో రామ్ చరణ్ తన ఎనర్జిటిక్ డ్యాన్స్ మూమెంట్స్‌తో అభిమానులను ఆకట్టుకుంటుండగా, జాన్వీకపూర్ తన గ్లామర్‌తో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. గ్రామీణ నేపథ్యంతో రూపొందించిన ఈ పాటలో చరణ్ రగ్డ్ లుక్‌లో ఊరమాస్ స్టెప్పు లతో అలరించాడు. జాన్వీ సంప్రదాయ దుస్తుల్లో కనిపిస్తూ ప్రేక్షకుల దృష్టిని ఆకర్షి స్తోంది. ఈ పాటకు రూపొందించిన నృత్య రూపకల్పన, భారీ సెట్స్, రంగుల హంగులు ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. విడుదలైన కొద్ది గంటల్లోనే ఈ వీడియోకు సామాజిక మాధ్యమాల్లో విశేష స్పందన లభిస్తోంది. ముఖ్యంగా రామ్‌చరణ్ డ్యాన్స్ స్టెప్పులపై అభిమానులు ప్రశంసలు కురిపిస్తున్నారు. ఈ చిత్రానికి ఆస్కార్ అవార్డు గ్రహీత ఏఆర్ రెహమాన్ సంగీతం అందించగా, పాటకు కూడా ఆయన స్వరాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.





# డూప్ లేకుండానే యాక్షన్ సన్నివేశాలు చేసిన సమంత

హైదరాబాద్, జూన్ 17

ప్రముఖ నటి సమంత రూత్ ప్రభు ప్రధాన పాత్రలో నటించిన 'మా ఇంటి బంగారం' చిత్రం జూన్ 19న ప్రేక్షకుల ముందుకు రానుంది. కుటుంబ భావోద్వేగాలు, యాక్షన్ అంశాల సమ్మేళనంగా రూపొందిన ఈ సినిమాపై ఇప్పటికే సినీ అభిమానుల్లో మంచి ఆసక్తి నెలకొంది. ముఖ్యంగా ఈ చిత్రంలో సమంత గతంలో ఎప్పుడూ కనిపించని శక్తివంతమైన పాత్రలో నటించినట్లు చిత్రబృందం వెల్లడిస్తోంది. సమాచారం ప్రకారం, యాక్షన్ నేపథ్యం ఉన్న ఓ మహిళ సంప్రదాయ కుటుంబంలో కోడలిగా అడుగుపెట్టిన తర్వాత ఆమె జీవితంలో చోటుచేసుకునే పరిణామాల చుట్టూ కథ సాగుతుంది. కుటుంబ కథనంతో పాటు ఉత్కంఠభరితమైన యాక్షన్ సన్నివేశాలు కూడా ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. సినిమా ప్రచార కార్యక్రమాల్లో భాగంగా మాట్లాడిన నటి రచన, సమంత అంకితభావాన్ని ప్రశంసించారు. ఈ సినిమాలో సమంత దాదాపు అన్ని యాక్షన్ సన్నివేశాలను డూప్ సహాయం లేకుండానే పూర్తి చేసిందని ఆమె తెలిపారు. ఫైట్ మాస్టర్లు సూచించిన ప్రతి అంశాన్ని శ్రద్ధగా పాటిస్తూ, ఎలాంటి భయం లేకుండా క్లిష్టమైన సన్నివేశాల్లో పాల్గొనేదని చెప్పారు. కొన్ని సన్నివేశాలు చాలా ప్రమాదకరంగా కనిపించినప్పటికీ, సమంత ఎంతో ధైర్యంగా వాటిని పూర్తి చేసిందని రచన వెల్లడించారు. తెరపై ఆ యాక్షన్ ఘట్టాలు చూసినప్పుడు సమంత ఎంత కష్టపడి పనిచేసిందో ప్రేక్షకులకు స్పష్టంగా అర్థమవుతుందని పేర్కొన్నారు. ఆమె చూపించిన నిబద్ధత నిజంగా అభినందనీయమని కొనియాడారు. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు, ట్రైలర్ సినిమాపై అంచనాలను పెంచగా, తాజాగా వచ్చిన ఈ వ్యాఖ్యలు ప్రేక్షకుల్లో మరింత ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి.





# కేరళలో 'హ్యాపీ' హవా రీ రిలీజ్‌తో రికార్డులు బద్దలు

కొచ్చి, జూన్ 17

అల్లు అర్జున్కు కేరళలో ఉన్న అభిమాన గణం మరోసారి బాక్సాఫీస్ వద్ద తన ప్రభావాన్ని చూపించింది. 'పుష్ప' చిత్రాల తర్వాత అక్కడ అపారమైన ఆదరణ పొందిన అల్లు అర్జున్‌ను అభిమానులు ప్రేమగా "మల్లు అర్జున్" అని పిలుస్తుంటారు. తాజాగా ఆయన నటించిన పాత విజయవంతమైన చిత్రం 'హ్యాపీ' 4కే సాంకేతికతతో మళ్లీ విడుదలై కేరళలో విశేష స్పందన పొందుతోంది. విడుదలైన కేవలం నాలుగు రోజుల్లోనే ఈ చిత్రం కోటి రూపాయలకు పైగా వసూళ్లు సాధించినట్లు సినీ వర్గాలు పేర్కొంటున్నాయి. సాధారణంగా రీ రిలీజ్ చిత్రాలకు పరిమిత స్థాయిలోనే స్పందన లభిస్తుండగా, 'హ్యాపీ'కు లభిస్తున్న ఆదరణ ట్రేడ్ వర్గాలను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. కేరళలో అల్లు అర్జున్‌కు ఉన్న అభిమానమే ఈ విజయానికి ప్రధాన కారణమని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. కొత్త సినిమాలకు సైతం అందని స్థాయిలో ఒక పాత చిత్రం వసూళ్లు నమోదు చేయడం విశేషంగా మారింది. థియేటర్ల వద్ద అభిమానులు ప్రత్యేక ప్రదర్శనలు, వేడుకలు నిర్వహిస్తూ చిత్ర విజయాన్ని ఆస్వాదిస్తున్నారు. ఇటీవలి కాలంలో విడుదలైన పలువురు ప్రముఖ హీరోల చిత్రాల కేరళ వసూళ్లతో పోలిస్తే 'హ్యాపీ' రీ రిలీజ్ మెరుగైన ఫలితాలు నమోదు చేసినట్లు ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. దీంతో అల్లు అర్జున్‌కు కేరళలో ఉన్న మార్కెట్ మరోసారి స్పష్టమైందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రీ రిలీజ్ రూపంలో వచ్చిన ఈ విజయం అల్లు అర్జున్ అభిమానుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. కొత్త చిత్రం కాకపోయినా, ప్రేక్షకులు భారీ సంఖ్యలో థియేటర్లకు రావడం ద్వారా ఆయన ప్రజాదరణ ఏమాత్రం తగ్గలేదని నిరూపితమైంది.




# 'పెద్ది'లో కొత్త సీన్లపై గందరగోళం

హైదరాబాద్, జూన్ 17

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా, దర్శకుడు బుచ్చిబాబు సానా తెరకెక్కించిన స్పోర్ట్స్ యాక్షన్ చిత్రం 'పెద్ది' బాక్సాఫీస్ వద్ద విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. విడుదలైన తొలి రోజు నుంచే భారీ వసూళ్లు సాధిస్తున్న ఈ చిత్రం ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా రూ.400 కోట్లకు పైగా గ్రాస్ కలెక్షన్లు రాబట్టి విజయవంతమైన ప్రదర్శనను కొనసాగిస్తోంది. ఈ నేపథ్యంలో సినిమాకు సంబంధించి తాజాగా వెలుగులోకి వచ్చిన ఒక అంశం అభిమానుల్లో ఆసక్తితో పాటు కొంత గందరగోళానికి కూడా కారణమైంది. ఇటీవల నిర్వహించిన ఒక ప్రచార కార్యక్రమంలో దర్శకుడు బుచ్చిబాబు సానా మాట్లాడుతూ, ప్రేక్షకుల నుంచి వచ్చిన స్పందనను దృష్టిలో ఉంచుకుని 'పెద్ది' చిత్రంలో కొన్ని కొత్త సన్నివేశాలను జోడిస్తున్నట్లు ప్రకటించారు. బుధవారం నుంచి ఆ అదనపు సన్నివేశాలతో సినిమా ప్రదర్శించబడుతుందని ఆయన వెల్లడించడంతో అభిమానుల్లో భారీ ఉత్సాహం నెలకొంది. ఇప్పటికే సినిమా చూసిన ప్రేక్షకులు కూడా కొత్తగా చేర్చిన సన్నివేశాలను వీక్షించేందుకు ఆసక్తి వ్యక్తం చేశారు. అయితే దర్శకుడి ప్రకటన వెలువడినప్పటి నుంచి చిత్ర నిర్మాణ సంస్థ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన రాకపోవడం చర్చకు దారితీసింది. సాధారణంగా సినిమాకు అదనపు సన్నివేశాలు జోడించినప్పుడు కొత్త పోస్టర్లు, నవీకరించిన ప్రదర్శన వ్యవధి వివరాలు లేదా సామాజిక మాధ్యమాల ద్వారా అధికారిక సమాచారం విడుదల చేయడం ఆనవాయితీగా ఉంటుంది. కానీ ఈసారి అలాంటి స్పష్టత లేకపోవడంతో అభిమానుల్లో సందేహాలు మొదలయ్యాయి. కొత్త సన్నివేశాలు నిజంగానే థియేటర్లలో ప్రదర్శించబడుతున్నాయా లేదా సాంకేతిక కారణాల వల్ల వాటి ప్రదర్శన వాయిదా పడిందా అనే అంశంపై సామాజిక మాధ్యమాల్లో విస్తృత చర్చ సాగుతోంది.




# భారత్ 'ఎ' ఘనవిజయం

### 101 పరుగుల తేడాతో అఫ్గానిస్తాన్ 'ఎ'పై గెలుపు

### ఫైనల్లో శ్రీలంకతో ఢీ

దంబుల్లా జూన్ 17: ముక్కోణపు సిరీస్‌లో భాగంగా జరిగిన మ్యాచ్‌లో అఫ్గానిస్తాన్ 'ఎ'పై 101 పరుగుల భారీ తేడాతో ఇండియా 'ఎ' ఘనవిజయం సాధించి, సగర్వంగా ఫైనల్ బెర్తును ఖరారు చేసుకుంది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన యువ భారత్ నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 319 పరుగుల భారీ స్కోరు సాధించగా, 320 పరుగుల లక్ష్యఛేదనతో బరిలోకి దిగిన అఫ్గాన్ 'ఎ' జట్టు భారత బౌలర్ల ధాటికి 36.5 ఓవర్లలోనే 218 పరుగులకే ఆలౌటైంది; అఫ్గాన్ బ్యాటర్లలో బాహిర్ షా (57), ఫైసల్ షినోజాదా (46), ఇమ్రాన్ మీర్ (32) మాత్రమే కాస్త చెప్పుకోదగ్గ స్కోర్లు చేయగలిగారు. భారత బౌలర్లలో నిషాంత్ సింధు 4 వికెట్లతో అఫ్గాన్ ఇన్నింగ్స్ నడుము విరవగా, యశ్ ఠాకూర్ 2, అంశుల్ కాంబోజ్, విప్రాజ్ నిగమ్, సుర్యాంశ్, అనుకుల్ రాయ్ తలో ఒక వికెట్ పడగొట్టి భారత్‌కు తిరుగులేని విజయాన్ని అందించారు. ఈ గెలుపుతో టీమిండియా తుది పోరుకు అర్హత సాధించగా, సిరీస్‌లో తదుపరి జరగనున్న అఫ్గాన్ 'ఎ', శ్రీలంక 'ఎ' మ్యాచ్ విజేత ఫైనల్లో ఇండియా 'ఎ'తో తలపడనుంది.

## ఎంబాప్పే ద్విగోల్ మెరుపు

ప్రపంచకప్ ఫుట్‌బాల్ టోర్నీలో ఫ్రాన్స్ కెప్టెన్ కైలియన్ ఎంబాప్పే మరోసారి తన అసాధారణ ప్రతిభను చాటుకున్నాడు. సెనెగల్‌తో జరిగిన మ్యాచ్‌లో రెండు గోల్స్ సాధించి జట్టును 3-1 తేడాతో విజయతీరాలకు చేర్చాడు. ఈ ప్రదర్శనతో ప్రపంచకప్ చరిత్రలో ఫ్రాన్స్ తరపున అత్యధిక గోల్స్ చేసిన ఆటగాడిగా కొత్త రికార్డు నెలకొల్పాడు. మూడో ప్రపంచకప్ ఆడుతున్న ఎంబాప్పే ఇప్పటివరకు టోర్నీ చరిత్రలో 14 గోల్స్ నమోదు చేశాడు. ప్రపంచకప్‌లలో అత్యధిక గోల్స్ సాధించిన ఆటగాళ్ల జాబితాలో అతడు వేగంగా ముందుకు దూసుకెళ్తున్నాడు. ప్రస్తుతం జర్మనీ దిగ్గజం మిరోస్లావ్ క్లోజ్, అర్జెంటీనా స్టార్ లియోనెల్ మెస్సీ చెరో 16 గోల్స్‌తో అగ్రస్థానంలో కొనసాగుతున్నారు. మరోవైపు బ్రెజిల్ మాజీ స్టార్ రొనాల్డో ఖాతాలో 15 గోల్స్ ఉన్నాయి. సెనెగల్‌తో జరిగిన మ్యాచ్‌లో 66వ నిమిషంలో ఎంబాప్పే తొలి గోల్ సాధించాడు. అంతకుముందు సెనెగల్ గోల్‌కీపర్ మెండీ ఫ్రాన్స్ దాడులను అడ్డుకుంటూ జట్టుకు అండగా నిలిచాడు. అయితే ఎంబాప్పే తొలి గోల్ తర్వాత ప్రత్యేక శైలిలో సంబరాలు జరుపుకోవడం అభిమానుల దృష్టిని ఆకర్షించింది. ఇటీవల ఒక ఇంటర్వ్యూలో వేణువు వాయించిన ఎంబాప్పే, ఆఫ్రికా జట్టుపై గోల్ సాధిస్తే అదే తరహా సంబరాన్ని ప్రదర్శిస్తానని చెప్పినట్లు తెలుస్తోంది. తన మాటను నిలబెట్టుకుంటూ గోల్ అనంతరం వేణువు ఊదుతున్నట్లుగా సంకేతం ఇచ్చాడు.





# మెస్సి 'హ్యాట్రిక్' ధమాకా

### అల్జీరియాపై అర్జెంటీనా ఘన విజయం!.. మెస్సి కెరీర్‌లోనే తొలి హ్యాట్రిక్

### 3-0 తేడాతో అల్జీరియా చిత్తు ... ఫ్రాన్స్‌ను గెలిపించిన ఎంబాపె

స్పోర్ట్స్ డెస్క్, జూన్ 17: ఫిఫా ఫుట్‌బాల్ ప్రపంచకప్‌లో టైటిల్ ఫేవరెట్‌గా బరిలోకి దిగిన అర్జెంటీనా జట్టు ఘనమైన ఆరంభాన్ని సొంతం చేసుకుంది. ఆ జట్టు స్టార్ ఆటగాడు, ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సి అద్భుతమైన హ్యాట్రిక్ గోల్స్‌తో కదం తొక్కడంతో, తమ తొలి మ్యాచ్‌లోనే అర్జెంటీనా 3-0 తేడాతో అల్జీరియాను మట్టికరిపించింది. మ్యాచ్ ప్రారంభమైనప్పటి నుంచే మైదానాన్ని తన ఆధీనంలోకి తెచ్చుకున్న మెస్సి.. 17వ నిమిషంలోనే అల్జీరియా డిఫెండర్లను ఛేదిస్తూ తొలి గోల్ కొట్టాడు. ఈ మెరుపు గోల్‌తో అర్జెంటీనాకు తొలి ఆధిక్యం లభించగా, మొదటి అర్ధభాగం ముగిసేసరికి ఆ జట్టు 1-0 లీడ్‌తో నిలిచింది.

ఇక సెకండాఫ్‌లో మెస్సి మాయ మరింత పీక్స్‌కు చేరింది. అల్జీరియా గోల్ పోస్ట్‌పై వరుస దాడులు చేస్తూ 60వ నిమిషంలో వ్యక్తిగత రెండో గోల్ చేసిన మెస్సి, ఆ తర్వాత కొద్దిసేపటికే 76వ నిమిషంలో మూడో గోల్‌ను కూడా నెట్‌లోకి పంపి తన హ్యాట్రిక్‌ను పూర్తి చేశాడు. ప్రపంచకప్ చరిత్రలో మెస్సికి ఇదే తొలి హ్యాట్రిక్ కావడం విశేషం. ఈ చారిత్రాత్మక ఘట్టాన్ని కళ్లారా వీక్షించిన స్టేడియంలోని వేలాది మంది ప్రేక్షకులు స్టాండింగ్ ఓవేషన్‌తో మెస్సిని అభినందించారు.

మరో ఆసక్తికర పోరులో డిఫెండింగ్ ఛాంపియన్ ఫ్రాన్స్ జట్టు 3-1 తేడాతో సెనెగల్‌ను ఓడించి శుభారంభం చేసింది. ఫ్రాన్స్ స్టార్ ఆటగాడు కిలియన్ ఎంబాపె రెండు గోల్స్‌తో జట్టును గెలిపించడమే కాకుండా.. ఫ్రాన్స్ దేశం తరపున అంతర్జాతీయ ఫుట్‌బాల్‌లో అత్యధిక గోల్స్ చేసిన ఆటగాడిగా సరికొత్త చరిత్ర సృష్టించాడు. తొలి అర్ధభాగంలో ఇరు జట్లు గోల్ కోసం హోరాహోరీగా తలపడ్డాయి. ఎంబాపెను కట్టడి చేసేందుకు సెనెగల్ డిఫెండర్లు శతవిధాలా ప్రయత్నించి సఫలమవడంతో ఫస్టాఫ్ 0-0తో ముగిసింది. 66వ నిమిషంలో ఎంబాపె ఫ్రాన్స్ ఖాతాలో తొలి గోల్ వేశాడు. 82వ నిమిషంలో యువ ఆటగాడు బ్రాడ్లీ బార్కోలా మరో గోల్ కొట్టడంతో ఫ్రాన్స్ ఆధిక్యం 2-0కి పెరిగింది. మ్యాచ్ ఇంజూరీ టైమ్‌లో సెనెగల్ ఆటగాడు ఇబ్రహీం ఎంబాయె గోల్ కొట్టడంతో స్కోరు 2-1కి చేరింది. అయితే, సెనెగల్ కోలుకునే లోపే.. కేవలం నిమిషం వ్యవధిలోనే ఎంబాపె దాదాపు 30 మీటర్ల దూరం నుంచి ఒక అద్భుతమైన లాంగ్-రేంజ్ గోల్ కొట్టి అందరినీ సంభ్రమాశ్చర్యాల్లో ముంచెత్తాడు. దీంతో ఫ్రాన్స్ 3-1తో విజయాన్ని ఖాయం చేసుకుంది.

# సిరీస్ మనదే..!


### గిల్, ఇషాన్ సెంచరీల మోత.. అఫ్గాన్‌పై 170 పరుగుల తేడాతో భారత్ ఘన విజయం

**అఫ్గానిస్థాన్‌తో జరిగుతున్న వన్డే సిరీస్‌ను భారత్ మరో మ్యాచ్ మిగిలుండగానే కైవసం చేసుకుంది.బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో తిరుగులేని ప్రదర్శన కనబరిచిన టీమిండియా 170 పరుగుల భారీ తేడాతో అఫ్గానిస్థాన్‌ను మట్టికరిపించింది. ఈ విజయంతో మూడు వన్డేల సిరీస్‌ను మరో మ్యాచ్ మిగిలి ఉండగానే 2-0తో భారత్ సొంతం చేసుకుంది.**

లక్నో, జూన్ 17: తొలుత బ్యాటింగ్ చేసిన టీమిండియా బ్యాటర్లు అఫ్గాన్ బౌలింగ్‌ను ముక్కలు ముక్కలు చేశారు. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (154; 110 బంతుల్లో) బాధ్యతాయుతమైన క్లాస్ ఇన్నింగ్స్‌తో చెలరేగగా, మరో ఎండ్‌లో వికెట్ కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్ (125; 79 బంతుల్లో) మెరుపు శతకంతో స్టేడియాన్ని హోరెత్తించాడు. వీరిద్దరి భారీ సెంచరీల పుణ్యమా అని భారత్ 49.5 ఓవర్లలో 402 పరుగుల మైలురాయిని అందుకొని ఆలౌటైంది. మిగతా బ్యాటర్లలో రోహిత్ శర్మ (48) తృణప్రాయంలో హాఫ్ సెంచరీ చేజార్చుకోగా, శ్రేయస్ అయ్యర్ (26), వాషింగ్టన్ సుందర్ (19) పరుగులు జోడించారు. అఫ్గాన్ బౌలర్లలో నంగేయాలియా 4, రషీద్ ఖాన్ 3 వికెట్లు పడగొట్టగా, ఘజన్‌ఫర్, మహమ్మద్ సలీం చెరో వికెట్ సాధించారు.

#### భారత బౌలర్ల ధాటికి అఫ్గాన్ విలవిల

403 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన అఫ్గానిస్థాన్ జట్టు భారత బౌలర్ల ధాటికి ఎక్కడా కోలుకోలేకపోయింది. క్రమంగా వికెట్లు కోల్పోతూ 232 పరుగులకే చేతులెత్తేసింది. అఫ్గాన్ బ్యాటర్లలో వన్‌డౌన్ బ్యాటర్ రహ్మత్ షా (79) ఒక్కడే అర్ధసెంచరీతో ఒంటరి పోరాటం చేయగా, మిగతావారెవరూ అతనికి తగిన సహకారం అందించలేకపోయారు. భారత బౌలర్లలో అర్షదీప్ సింగ్ (3/45), గుర్నూర్ బ్రార్ (3/60) చెరో మూడు వికెట్లతో అఫ్గాన్ ఇన్నింగ్స్ నడ్డి విరవగా.. యువ బౌలర్ ప్రిన్స్ యాదవ్ (2/56) రెండు వికెట్లతో రాణించి భారత్‌కు తిరుగులేని విజయాన్ని అందించారు.



"This newspaper/periodical is published by KALIDINDI SUMALATHA from 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA - 500020. on behalf of **RS USAR PUBLICATIONS**, edited by RAGHURAMA RAJU KALIDINDI and printed by **KALIDINDI SUMALATHA** at **KING DIGITAL OFFSET PRINTERS**, 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA – 500020. **PRGI NO: TGTEL/26/A2948**, Email: rsusarp@myyahoo.com, 9849350555, 9515121467